

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 సంచిక : 231 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శనివారం 14 డిసెంబర్ 2024 | వెల : 4/-




## దేశ ఐక్యతకు రాజ్యాంగం ఓ రోడ్‌మ్యాప్

- రాజ్యాంగం ఏక పార్టీ కృషి కాదు
- ఒక పార్టీ రాజ్యాంగాన్ని హైజాక్ చేసేందుకు ప్రత్నించింది
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- భారతదేశ సమున్నత విలువలకు అనుగుణంగా దేశ ప్రజలు రాజ్యాంగ నిర్మాణం చేశారు
- ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో రాజ్యాంగాన్ని అవమానించాయి
- బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని అనేక కీలక పథకాల అభివృద్ధి



## 'ఒకే భారతదేశం, సమున్నత భారతదేశం' స్ఫూర్తితో మహా కుంభమేళా

- ప్రజలందర్నీ ఏకం చేసే మహా యజ్ఞమే కుంభమేళా
- ఎంతెరెందరో సాధువులు, సన్యాసులు, రుషులు, పండితులు, సాధారణ ప్రజానీకం కలిసికట్టుగా మూడు నదుల సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారు
- కులాల మధ్య అంతరాయాలు, మత ఘర్షణలు ఇక్కడ మటుమాయమవుతాయి
- వచ్చే ఏడాది జరిగే మహాకుంభ మేళా దేశ సంస్కృతి, ఆధ్యాత్మికతను సమున్నత శిఖరాలకు చేరుస్తుంది



## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మృతి
- బాసగూడ పరిధి నేంద్ర, పన్నూరు అడవుల్లో పోలీసుల కూంబీంగ్
- ఘటనా స్థలంలో రెండు బోర్ గన్లు, నక్సల్ యూనిఫామ్, ఆయుధాలు, ఇతర సామాగ్రి స్వాధీనం
- దండకారణ్యంలో మావోయిస్టులు సమావేశమవుతున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులకు విశ్వసనీయ సమాచారం

# అంతు చిక్కని రేవంత్ వ్యూహం

- ఉద్యమకారులకు అండగా... కాంగ్రెస్
- ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్‌కు ముద్రపడింది
- ఆ ముద్రను తొలగించేందుకు ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న కీలక కళాకారుల్ని, ఉద్యమకారుల్ని కాంగ్రెస్ తన వైపు తిప్పుకునేందుకు ట్రై చేస్తోందని టాక్
- ఇప్పటికే జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించి ఆ పాట రాసిన అందెశ్రీని తమ వైపు తిప్పుకోగలిగారు.



హైదరాబాద్

కాంగ్రెస్ ఏడాది ప్రభుత్వ పాలన వేడుకలు గులాబీ పార్టీకి కొత్త చిక్కులు తెచ్చి పెట్టాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గులాబీ పార్టీలో ఓ ఎమ్మెల్సీని డిఫెన్స్‌లోకి లాగింది. ప్రజా పరిపాలన వేడుకల్లో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహానికి కొత్త రూపం ఇస్తూ.. సచివాలయంలో ఆవిష్కరించింది కాంగ్రెస్ పార్టీ. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన కొంతమందికి కళాకారులకు సర్కార్ కోటి రూపాయాల నజరానాలు ప్రకటించింది. పైగా ఇంటి స్థలాన్ని కూడా ప్రకటించింది. ఇదంతా బాగానే ఉంది కానీ. నజరానా ప్రకటించిన జాబితాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పేరు కూడా ఉండడం పెద్ద చర్చకు దారితీసింది.కవి గోరటి వెంకన్న.. తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. తన రాగాలతో ఉద్యమ స్ఫూర్తి రగిలించారు. తెలంగాణ ప్రజల్ని ఉద్యమం వైపు నడిపించారు. ప్రజాకవి గోరటి వెంకన్న హృదయమంతా పాటల సవ్వడితోనే - మిగతా3లో



## ఇకనైనా రైతులకు క్షమాపణ చెప్పి కేసులు రద్దు చెయ్యి

### సీఎం రేవంత్‌కి కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్

లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనలో కంది సెంట్రల్ జైలు జైలర్ సంజీవరెడ్డిని సస్పెండ్ చేయడంతో పాటు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్‌పై విచారణకు ఆదేశిండంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. భూమి ఇయ్యను అన్నందుకు గిరిజన రైతులను జైలు లో పెట్టడం ఓకేనట.. జైలులో వారిని చిత్రహింసలు పెట్టడం ఓకేనట.. వారి కుటుంబసభ్యులను అర్ధరాత్రి ఇండ్ల మీద దాడిచేసి భయపెట్టడం, బెదిరించడం ఓకేనట.. నెల రోజులుగా వారికీ చెయ్యని నేరానికి బెయిల్ కూడా రాకుండా అడ్డుపడటం ఓకేనట.. గుండె జబ్బుతో ఉన్న పేషెంటుకు బేడీలు వేయించటం కూడా ఓకేనట అని కేటీఆర్ విమర్శించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని - మిగతా3లో

# క్యాబినెట్ విస్తరణపై నో క్లారిటీ!

- కేబినెట్ విస్తరణకు అడగడుగునా అడ్డంకులు
- సీఎం రేవంత్ రెడ్డి నుంచి అధిష్టానం వరకు విన్నపాలు చేసుకుంటున్నారు.
- ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా విస్తరణ మాత్రం జరగడం లేదు.
- క్యాబినెట్ విస్తరణ ఊరిస్తూనే ఉంది
- ఈ నిశబ్ద వాతావరణంతో కొండంత ఆశ పెట్టుకున్న ఆశావహుల గుండెలు గుభేల్‌మంటున్నాయి.
- మంత్రివర్గంలో చోటు కోసం చాలా మంది ఆశావహులు కొండంత ఆశ పెట్టుకున్నారు.



హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. అప్పటి నుంచి బుగ్గ కారు కోసం కొందరు నేతలు కంట్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఏదో శుభవార్త తెస్తారని ఎదురుచూడడం.. ఢిల్లీ నుంచి వచ్చి విస్తవరణపై పెదవి విప్పకపోవడంతో డీలా పడిపోవడం సర్వ సాధారణమైపోయింది. ఈ నిశబ్ద వాతావరణంతో కొండంత ఆశ పెట్టుకున్న ఆశావహుల గుండెలు గుభేల్‌మంటున్నాయి. అసలు విస్తరణ ఉంటుందా? ఉంటే ఎప్పుడు ఉంటుంది? అంటూ గుర్రుగా ఉన్నారట ఎమ్మెల్యేలుగతేడాది డిసెంబర్ 7న సీఎంగా అధికార పగ్గాలు చేపట్టిన రేవంత్ రెడ్డి..తనతో పాటు 11మందితో ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి - మిగతా3లో

# జైలు.. బెయిలు..

- అల్లు అర్జున్‌కు భారీ ఊరట...
- సంధ్య థియేటర్ ఘటనలో హైకోర్టు మధ్యంతర బెయిల్
- సంధ్య థియేటర్ దుర్ఘటనలో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన చిక్కడపల్లి పోలీసులు
- హైకోర్టులో క్వాష్ పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలు
- క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలన్న న్యాయవాది
- ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు
- నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు



సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో అరెస్టైన నటుడు అల్లు అర్జున్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించారు. దీంతో కేసును కొట్టేయాలంటూ అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం అల్లు అర్జున్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. క్వాష్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేస్తూ తక్షమే బెయిల్ మంజూరు చేసింది.

## చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- ఇందులో తన జోక్యం ఏమీ ఉండదు
- చట్టం ముందు అందరూ సమానులే
- అల్లు అర్జున్ అరెస్ట్‌పై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి..



## 'ఒకే భారతదేశం, సమున్నత భారతదేశం'

# స్ఫూర్తితో మహా కుంభమేళా

**ప్రయాగరాజ్:** కులమతాలకు అతీతంగా ప్రజలందర్నీ ఏకం చేసే మహా యజ్ఞమే కుంభమేళా అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. "ఒకే భారతదేశం, సమున్నత భారతదేశం" అనే సందేశాన్ని సంగమ స్నానం ద్వారా దేశవాసులు చాటుతారని అన్నారు. ఎంతరెందరో సాధువులు, సన్యాసులు, రుషులు, పండితులు, సాధారణ ప్రజానీకం కలిసికట్టుగా మూడు నదుల సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారని, కులాల మధ్య అంతరాయాలు, మత ఘర్షణలు ఇక్కడ మటుమాయమవుతాయని చెప్పారు. మహాకుంభమేళా ద్వారా దేశానికి, సమాజానికి సానుకూల సంకేతాలు వెళ్తాయన్నారు. ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమం (గంగ-యమున-సరస్వతి కలిసే చోటు)లో శుక్రవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ప్రధాని అనంతరం జరిగిన 'మహాకుంభ్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.



వచ్చే ఏడాది జరిగే మహాకుంభ మేళా దేశ సంస్కృతి, ఆధ్యాత్మికతను సమున్నత శిఖరాలకు చేరుస్తుందన్న ఆశాభావాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. మహాకుంభ మేళా విజయవంతానికి పాటుపడుతున్న వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులను ప్రధాని అభినందించారు. ప్రయాగరాజ్ గడ్డ సరికొత్త చరిత్రను సృష్టించడం ఖాయమని అన్నారు. ఒకే మాటలో చెప్పాలంటే మహాకుంభమేళాతో జరిగే ఈ ఐక్యతా మహాయజ్ఞం గురించి యావత్ ప్రపంచం చర్చించుకుంటుందన్నారు. ఎలాంటి కమ్యూనికేషన్ లేని రోజుల్లోనే మహాకుంభమేళా వంటి కార్యక్రమాలు సామాజిక మార్పులకు పునాది వేశాయని, ఇలాంటి సందర్భాలే దేశ ఐక్యతా సంకేతాన్ని దశదిశలా చాటుతాయని తెలిపారు.

కుంభ్, ఇతర మతపరమైన తీర్థయాత్రలను గత ప్రభుత్వాలు సరైన అవగాహన లేక నిర్లక్ష్యం చేశాయని ప్రధాని విమర్శించారు. భక్తులు అనేక ఇక్కట్లకు గురయ్యేవారని, కానీ ఈసారి ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. ఇప్పుడు భారత సంస్కృతిని గౌరవించే ప్రభుత్వాలు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఉన్నట్టు తెలిపారు. రాబోయే కుంభమేళాకు సౌకర్యాల కల్పనను డబుల్ ఇంజన్ గవర్నమెంట్ ఒక బాధ్యతగా తీసుకుంటుందని తెలిపారు. కాగా, ప్రధానితో పాటు ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్ పాల్గొన్నారు.

# దేశ ఐక్యతకు రాజ్యాంగం ఓ రోడ్‌మ్యాప్

**న్యూఢిల్లీ:** రాజ్యాంగం ఏక పార్టీ కృషి కాదని కాంగ్రెస్‌ను ఉద్దేశించి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఒక పార్టీ రాజ్యాంగాన్ని హైజాక్ చేసేందుకు ప్రత్నించిందని విమర్శించారు. భారత రాజ్యాంగం ఏక పార్టీ కృషి కాదని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75వ పడిలోకి అడుగుపెట్టిన సందర్భంగా పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరిగింది. ప్రభుత్వం తరపున రాజ్‌నాథ్ సింగ్ ఈ చర్చను ప్రారంభించారు. దేశాన్ని ఐక్యంగా, ప్రజాస్వామ్యంగా, స్వావలంబనగా ఉంచేందుకు రాజ్యాంగం ఓ రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి నైతిక దిక్సూచి అని, ప్రతి వ్యక్తికి బలమైన గుర్తింపును అందిస్తుందని పేర్కొన్నారు. అయితే, ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో రాజ్యాంగాన్ని అవమానించాయని మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని అనేక కీలక పథకాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కాగా, శనివారం వరకూ ఈ చర్చ కొనసాగుతుంది. సభ్యులు దీనిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇక చర్చకు ముగింపుగా



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు సమాధానం ఇవ్వనున్నారు "భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళు అయిన సందర్భంగా ఈ సభకు, దేశ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసుకుంటున్నాను. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవనానికి సంబంధించిన అన్ని కోణాలను స్పృశిస్తూ జాతి నిర్మాణానికి రాజ్యాంగం మార్గం ఏర్పరిచిందని చెప్పగలను. భారతదేశ సమున్నత విలువలకు అనుగుణంగా దేశ ప్రజలు రాజ్యాంగ నిర్మాణం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కాస్ విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ స్ఫూర్తితో, భారత రాజ్యాంగంలో రాసిన ధర్మానికి అనుగుణంగా పని చేస్తోంది. ప్రగతిశీల, ఇన్‌క్లూజివ్, ట్రాన్స్‌పర్మేటివ్ రాజ్యాంగం మనది. పేద కుటుంబంలో పుట్టిన వ్యక్తి కూడా దేశ ప్రధాని కావచ్చు, రాష్ట్రపతి కావచ్చు" అని రాజ్‌నాథ్ తన చర్చలో పేర్కొన్నారు.

పోస్ట్‌కలోనియల్ డెమొక్రసీలు, వారి రాజ్యాంగాలు ఎంతోకాలం మనలేదని, కానీ భరత రాజ్యంగం ఎన్ని సవాళు ఎదురైనా మౌలిక స్ఫూర్తిని కోల్పోకుండా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా కీలక భూమిక పోషిస్తోందని రాజ్‌నాథ్ అన్నారు. రాజ్యాంగ కస్టోడియన్‌గా సుప్రీంకోర్టు పాత్రను అంతా అంగీకరిస్తున్నామని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ అనే మాట ఇవాళ వినిపిస్తోందని, అది అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఎవరు రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నారు, ఎవరు గౌరవించడం లేదనే విషయాన్ని కూడా మనం అవగతం చేసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలా సీతారామన్.. వరుసగా ఆరోసారి చోటు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో చోటు సాధించారు. ఫోర్బ్స్ ఏటా వ్యాపారం, వినోదం, రాజకీయ, దాతృత్వం తదితర రంగాల నుంచి ప్రభావవంతమైన వ్యక్తుల ర్యాంకింగ్‌లను విడుదల చేస్తుంటుంది. ఈ ఏడాది కూడా ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్ నుంచి మొత్తం ముగ్గురికి చోటు దక్కింది. అందులో నిర్మలమ్మ తొలి స్థానంలో నిలిచారు. ఇక వరుసగా ఆరో సంవత్సరం ఈ జాబితాలో ఆమె చోటు దక్కించుకోవడం విశేషం. శక్తిమంతమైన మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ తొలిసారి 2019లో చోటు దక్కించుకున్నారు. ఆ ఏడాది ఆమెకు 34వ ర్యాంక్ దక్కింది. 2020లో 41వ స్థానం, 2021లో 37వ స్థానం సాధించిన ఆమె 2022లో 36వ స్థానం, 2023లో 32వ స్థానంలోనిలిచారు. ఇప్పుడు 28వ స్థానంలో చోటు దక్కించుకోవడం విశేషం. ఏటా తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ వస్తున్నారు. ఇక నిర్మలమ్మ తర్వాత ఈ జాబితాలో ప్రముఖ ఐటీ సంస్థల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్, హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈవో అయిన రోష్ని నాడార్ మల్హోత్రా 81వ స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ప్రముఖ ఔషధ తయారీ సంస్థ బయోకాన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా 82వ స్థానంలో ఉన్నారు.

# ఇది సంవిధాన్...సంఘ్ బుక్ కాదు

**న్యూఢిల్లీ:** దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమని గతం గురించే బీజేపీ మాట్లాడుతుందని, ఆయన జ్ఞాపకాలను చెరిపివేసే ప్రయత్నం చేస్తోందని, అయినప్పటికీ స్వాతంత్ర్య పోరాటం, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను ఎవరూ చెరిపివేయలేరని లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. గత పదేళ్లలో దేశ ప్రగతి కోసం ఏం చేశారో, ఇప్పుడేం చేస్తున్నారో వాళ్లు మాట్లాడాలని అన్నారు. ఇది సంవిధాన్ అనీ సంఘ్ బుక్ కాదని విమర్శించారు. భారత రాజ్యాంగం 75వ వసంతంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో దీనిపై ప్రత్యేక చర్చలో ప్రియాంక మాట్లాడారు. అదానీ అంశంపై ప్రభుత్వం చర్చించేందుకు భయపడటం వల్లే వ్యూహాత్మకంగా లోక్‌సభను సజావుగా నడవనీయడం లేదని విమర్శించారు. రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ కూడా సభకు హాజరయ్యారు.



"సంభాల్ బాధిత కుటుంబాలకు చెందిన కొందరు నన్ను కలుసుకునేందుకు వచ్చారు. వారిలో ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఒకరికి నా కుమారుడి వయస్సు ఉంటుంది. మరొకరికి 17 ఏళ్లు. వాళ్ల తండ్రి ఒక టైలర్. ఆయనకు ఒక డ్రీమ్ ఉంది. తన పిల్లలను బాగా చదివించి ఒకరిని డాక్టర్‌ను, మరొకరిని జీవితంలో స్థిరపడేలా చేయాలని అనుకునేవాడు. ఆయనను పోలీసులు కాల్చిచంపారు. తాను పెరిగి పెద్దయ్యాక తన తండ్రి కోరిక మేరకు డాక్టర్ అవుతానని 17 ఏళ్ల అద్నాన్ చెప్పాడు. అతని మనసులో అలాంటి ఆశలు, కలలకు అవకాశం కల్పించింది భారత రాజ్యాంగమే" అని ప్రియాంక అన్నారు.

కులగణన జరపకుండా కేంద్రం తప్పించుకుంటోందని ప్రియాంక గాంధీ విమర్శించారు. కులగణన ఇప్పటి అవసరమని, విధానాల రూపకల్పనకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరుస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగ ఒక రక్షాకవచం వంటిదని, పౌరులకు న్యాయం, ఐక్యమత్యం, భావ ప్రకటనా స్వేచ్ఛకు కవచం అని అన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న వాళ్లు చాలా పెద్దమాటలే చెబుతూ, రాజ్యాంగం హామీ ఇచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమనే కవచానికి తూట్లు పొడుస్తోందని తప్పుపట్టారు. ప్రైవేకరణతో రిజర్వేషన్లను బలహీన పరచే ప్రయత్నం చేస్తోందన్నారు.

ఉన్నావో అత్యాచారం, నిరుద్యోగం, వయనాడ్‌లో కొండచరియల వైపరీత్యం, ద్రవ్యోల్బణం వంటి అంశాలను ప్రియాంక తన చర్చలో ప్రస్తావించారు. ఉన్నావోలో అత్యాచార బాధితురాలి ఇంటికి వెళ్లానని, ఆమె తండ్రిని కలిసానని, వారు వ్యవసాయ భూమిని తగులపెట్టారని, సోదరులను కొట్టారని, తమకు న్యాయం జరగాలని ఆయన వాపోయారని సభ దృష్టికి ప్రియాంక తెచ్చారు. భారత రాజ్యాంగం మహిళలకు అధికారం ఇచ్చిందని, కానీ మహిళలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని, తన హక్కుల కోసం వారు మరో పదేళ్లు వేచిచూడాలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతులకు భద్రత కల్పించడం లేదని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణానికి ఎలాంటి పరిష్కారం చూపించడం లేదని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో ధనవంతులు ఇంకా ధనవంతులవుతుంటే, పేదవాళ్లు మరింత పేదవాళ్లవుతున్నారని ఆక్షేపించారు. పరోక్షంగా ప్రధానిని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల్లోకి వెళ్లేందుకు 'కింగ్'కు ధైర్యం సరిపోవడం లేదన్నారు. గత 15 రోజులుగా తాను పార్లమెంటుకు వస్తున్నానని, అనేక అంశాలు సభలో ప్రస్తావించాల్సి ఉన్నప్పటికీ ప్రధానమంత్రి కేవలం 10 నిమిషాలే సభలో కనిపించారని అన్నారు. చివరగా 'సత్యమేవ జయతే' అంటూ ప్రియాంక తన చర్చను ముగించారు.

## 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'పై బహిరంగ చర్చ కోరుతున్నా, ఆర్టికల్ 370 మాదిరిగా జరుగకూడదు

**శ్రీనగర్:** జమిలి ఎన్నికలకు సంబంధించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా దీనిపై స్పందించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'పై బహిరంగ చర్చ జరుగాలని తాను కోరుతున్నట్లు తెలిపారు. జమ్ముకశ్మీర్ స్వయం ప్రతిపత్తికి సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు మాదిరిగా జరుగకూడదని చెప్పారు. 'ఈ బిల్లు ఇంకా పార్లమెంటు ముందుకు రాలేదు. దానిపై సభలో చర్చ జరుగుతుంది. చర్చ బహిరంగంగా ఉండాలి. 2019లో ఆర్టికల్ 370 రద్దు జరిగినట్లుగా ఇది ఉండకూడదు. ఈ బిల్లును బహిరంగంగా చర్చించాలి' అని మీడియాతో అన్నారు. కాగా, తమ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఎంపీలతో ఈ బిల్లు గురించి చర్చించి వారి అభిప్రాయం తెలుసుకుంటామని జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. పార్లమెంట్‌లో ఈ బిల్లుపై ఎలా ఓటు వేయాలో అన్నది వారికి చెబుతామని అన్నారు.



## ప్రియాంకాగాంధీ తొలి స్పీచ్ ఎక్సలెంట్



లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు, వాయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ చేసిన తొలి ప్రసంగాన్ని ఆమె తల్లి, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ మెచ్చుకున్నారు. ఇవాళ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్తున్న సోనియాగాంధీని.. ప్రియాంకాగాంధీ ప్రసంగంపై మీ అభిప్రాయం ఏమిటని మీడియా ప్రశ్నించగా.. ఆమె 'ఎక్సలెంట్' అని స్పందించారు. ఆ తర్వాత తన కారెక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఇటీవల ఎంపీగా గెలిచిన ప్రియాంకాగాంధీ.. ఇవాళ లోక్‌సభలో తొలిసారి ప్రసంగించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో జరుగుతున్న ప్రత్యేక చర్చలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై ఆమె ఘాటు విమర్శలు చేశారు. దేశ పౌరులకు రక్షణ కవచం లాంటి రాజ్యాంగాన్ని బద్దలు కొట్టేందుకు గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదని విమర్శించారు. కులగణన విషయంలో ప్రభుత్వ తీరుపై కూడా ప్రియాంకాగాంధీ మండిపడ్డారు. కులగణనపై ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ నేతలు తరచూ మాజీ ప్రధాని నెహ్రూ పేరెత్తడంపై కూడా ప్రియాంకాగాంధీ స్పందించారు. దేశానికి సంబంధించిన ప్రతి విషయానికి నెహ్రూనే బాధ్యులా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్



**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య మరోసారి ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. శుక్రవారం ఉదయం బీజాపూర్ జిల్లాలోని బాసగూడ పరిధి నేంద్ర, పన్నూరు అడవుల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో భద్రాతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. కాల్పుల అనంతరం ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు లభించాయన్నారు. ఘటనా స్థలంలో రెండు బోర్ గన్లు, నక్సల్ యూనిఫామ్, ఆయుధాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నదని తెలిపారు.

గురువారం దంకారుణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది.

పోలీసుల కథనం ప్రకారం.. దండకారణ్యంలో మావోయిస్టులు సమావేశమవుతున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్ జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ) బలగాలతో పాటు దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లాల సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వీరికి మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టుల మృతి చెందారు. కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు బస్తర్ డివిజన్‌లో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 217 మంది మావోయిస్టులు మృతిచెందారు.

## భూమిని ఢీకొట్టబోతున్న ఆస్టరాయిడ్

**మన ఇస్రో శాస్త్రవేత్తల హెచ్చరిక**

**అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్**

**భవిష్యత్తులో భూమిని ఢీకొట్టే అవకాశం ఉందన్న ఇస్రో శాస్త్రవేత్తలు**

**ఇస్రోకు చెందిన 'నేత్ర' విభాగం ఆధ్వర్యంలో పరిశోధన**



అంతరిక్షంలో తిరుగుతున్న ఒక భారీ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఆ ఆస్టరాయిడ్ ఢీకొంటే దారుణమైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ ఆస్టరాయిడ్ పై ఇస్రో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ తాజాగా వెల్లడించారు.

**మరో ఐదేళ్లలో ఢీకొనే చాన్స్...**

అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్ భవిష్యత్తులో భూమికి అత్యంత సమీపంగా వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. సుమారు 450 మీటర్ల పొడవు, 170 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఆస్టరాయిడ్... 2029 ఏప్రిల్ 13న భూమికి అత్యంత దగ్గరగా అంటే.. కేవలం 32 వేల కిలోమీటర్ల సమీపం నుంచి దూసుకువెళుతుందని తేల్చారు. అంటే భూమి చుట్టూ స్థిర కక్ష్యలో తిరిగే కమ్యూనికేషన్ శాటిలైట్ల కంటే కూడా ఇది దగ్గరగా వస్తుండడం గమనార్హం.

**'నేత్ర' ఆధ్వర్యంలో పరిశోధన**

అపోఫిస్ మన యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య కంటే పెద్దదని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. అపోఫిస్ భూమిని ఢీకొట్టే పరిస్థితి, దాని గమనం, ఇతర అంశాలపై ఇస్రోలోని 'నేత్ర (నెట్ వర్క్ ఫర్ స్పేస్ ఆబ్జెక్ట్ ట్రాకింగ్ అండ్ అనాలసిస్)' విభాగం ఆధ్వర్యంలో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో నాసాకు చెందిన ఒసిరిస్ ఆర్‌ఈఎక్స్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రామ్సెస్ విభాగాలతో ఆస్టరాయిడ్లపై పరిశోధనలో కలసి ముందుకువెళుతున్నట్టు వివరించారు.

# జైలు.. బెయిలు..

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో అరెస్టైన నటుడు అల్లు అర్జున్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించారు. దీంతో కేసును కొట్టేయాలంటూ అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం అల్లు అర్జున్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. క్వాష్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేస్తూ తక్షమే బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని అల్లు అర్జున్ తరపున న్యాయవాది కోరగా.. కేసుపై సోమవారం విచారణ జరపాలని, అత్యవసర విచారణ అవసరం లేదని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదించారు. క్వాష్ పిటిషన్‌పై విచారణను వాయిదావేస్తే తక్షణమే బెయిల్ మంజూరుచేసేలా ఆదేశాలు ఇవ్వాలని అల్లు అర్జున్ తరపు న్యాయవాది కోరగా.. ప్రభుత్వ తరపు న్యాయవాది బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. బెయిల్, క్వాష్ పిటిషన్‌ను పరిగణలోకి తీసుకోవద్దని ప్రభుత్వ లాయర్ కోరారు. తన క్లైంట్‌పై పెట్టిన కేసు కొట్టేయాలని 118 (1) బీఎన్ఎస్ అల్లు అర్జున్‌కు వర్తించదని ఆయన తరపు లాయర్ నిరంజన్ రెడ్డి వాదించారు. అల్లు అర్జున్‌కు బెయిల్ ఇస్తే మీ అభ్యంతరం ఏమిటని ప్రభుత్వ న్యాయవాదిని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా ఈఘటనకు పాల్పడలేదని, తన క్లైంట్‌కు ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించారు.

**వాదనలు ఇలా..**

క్వాష్ పిటిషన్‌పై విచారణ జరపలేమని న్యాయస్థానం చెప్పడంతో వెంటనే మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని అల్లు అర్జున్ తరపు న్యాయవాది కోరారు. ప్రభుత్వ తరపు న్యాయవాది బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. అయినప్పటికీా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయస్థానం అల్లు అర్జున్‌కు బెయిల్ మంజూరు చేస్తూ నిర్ణయం వెలువరించింది.

**ప్రత్యేకంగా..**

నిందితుడికి బెయిల్ కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ప్రత్యేకమైన కేసుల్లో పై న్యాయస్థానాలు కలుగజేసుకుని మధ్యంతర బెయిల్ ఇచ్చే అవకాశం ఉంటుంది. అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టులో వెయ్యకుండా కేసు కొట్టేయాలని క్వాష్ పిటిషన్ వేశారు. క్వాష్ పిటిషన్‌పై తక్షణ విచారణకు కోర్టు అంగీకరించకపోవడంతో బెయిల్ పిటిషన్‌ను పరిగణలోకి తీసుకోవాలని లాయర్ కోరడంతో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు చెప్పింది. దీంతో జైలు నుంచి అల్లు అర్జున్ విడుదల కానున్నారు.

**అల్లు అర్జున్ వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే: న్యాయవాది**



అల్లు అర్జున్ ప్రతిసారి తన సినిమా విడుదల రోజు థియేటర్‌కు వెళతారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇప్పుడు కూడా సంధ్య థియేటర్ యాజమాన్యం, నిర్మాత, పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. అల్లు అర్జున్ థియేటర్ మొదటి అంతస్తులో కూర్చున్నారని హైకోర్టుకు తెలిపారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడమంటే వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే అన్నారు. అతనిని అరెస్ట్ చేసినందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన భద్రత ఇవ్వలేదన్నారు. అక్కడున్న పోలీసులు కూడా అల్లు అర్జున్‌ను చూసేందుకే ఆసక్తి చూపించారన్నారు.

## చట్టం తన పని తాను చేసుకుపోతుంది

టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులున్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరఫు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.


## ఇకనైనా రైతులకు క్షమాపణ చెప్పి కేసులు రద్దు చెయ్యి..

-మొదటిపేజీ తరువాయి

పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. ఇకనైనా క్షమాపణలు చెప్పి కేసులు రద్దు చేయాలని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన హీర్యానాయక్‌కు కంది జైలులోనే బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా గుండెనొప్పి వచ్చింది. దీంతో జైలు వైద్యులు పరీక్షలు చేశారు. అక్కడే ఈసీజీ తీసి చికిత్స కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. సంగారెడ్డి దవాఖానలో ఈసీజీ ఇతర పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసి పంపించారు. బుధవారం రాత్రి మరోమారు హీర్యానాయక్‌కు గుండెనొప్పి రావటంతో తిరిగి సంగారెడ్డి దవాఖానకే తీసుకురాగా వైద్యులు చికిత్స చేసి పంపించారు. గురువారం ఉదయం హీర్యానాయక్ గుండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జైలు సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో కాకుండా జైలు వాహనంలోనే చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో వైద్యులు అశోక్, మజీద్‌ఖాన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయగా ఆసమయంలోనూ రైతుకు బేడీలు తీయలేదు. పరీక్షలు ముగిసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం పంజాగుట్టలోని నిమ్స్‌కు తరలించాలని సూపరింటెండెంట్, వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. హీర్యానాయక్ చాలారోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. 2డీ ఈకో పరీక్ష చేయగా గుండె బలహీనంగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. సంగారెడ్డిలో కాథల్యాబ్ లేనందున నిమ్స్‌కు రిఫర్ చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. అండర్ ట్రయల్‌లో ఉన్న ఖైదీలకు సంకెళ్లు వేయవద్దని గతంలో కోర్టులు చెప్పినా అవేమీ పట్టించుకోండా కంది సెంట్రల్ జైలు పోలీసులు హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించటం తీవ్ర విమర్శలకు దారితీసింది. జైలు అధికారుల తీరును గిరిజన, రైతు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

## కాళోజీ కళాక్షేత్రానికి ఆదిలోనే పగుళ్లు





**వరంగల్ :** హైదరాబాద్ లోని రవీంద్ర భారతిని తలదన్నేలా వరంగల్ లో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రానికి ఆదిలోనే పగుళ్లు ఏర్పడ్డాయి. గత, ప్రస్తుత ప్రభుత్వాలు మొత్తంగా రూ.90 కోట్ల వరకు వెచ్చించి, ప్రజా కవి కాళోజీ నారాయణరావు పేరున నిర్మించిన ఈ కళాక్షేత్రం ఓపెనింగ్ నిర్వహించి నెల కూడా దాటకముందే ఈ పగుళ్ల వ్యవహారం కలకలం రేపుతోంది. శంకుస్థాపన చేసి పదేళ్లపాటు పట్టించుకోకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, క్రెడిట్ కొట్టేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం హడావుడిగా పనులు పూర్తి చేయడం వల్లే కళాక్షేత్రానికి ఈ దుస్థితి ఎదురై ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు అసంపూర్తిగా ఉండటంతో పాటు సరిగా క్యూరింగ్ కాకముందే హడావుడిగా ప్రారంభానికి సిద్ధం చేయడం వల్ల గోడలు నెర్రలుబారాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా రూ.90 కోట్లు పెట్టి పూర్తి చేసిన కళాక్షేత్రం ఆదిలోనే పగుళ్ల బారిన పడటంతో దాని నాణ్యత ప్రమాణాలు అధికారులు కూడా పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణ ఏర్పడిన కొత్తలో వరంగల్ కు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరున కళాక్షేత్రం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు 2014 సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా వరంగల్ కు వచ్చిన కేసీఆర్.. ఈ మేరకు హయగ్రీవాచారి గ్రౌండ్ పక్కనే ఉన్న నాలుగెకరాల స్థలంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. రవీంద్ర భారతిని తలదన్నేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మించాలంటూ రూ.50 కోట్లు కూడా ప్రకటించారు. శంకుస్థాపన చేసిన తరువాత సరైన సమయంలో నిధులు విడుదల కాకపోవడం వల్ల పనులు నెమ్మదించాయి. స్థానిక ఎమ్మెల్యేలు కూడా పట్టించుకోకపోవడం, కాళోజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా పనులు పూర్తి చేస్తామంటూ హడావుడి చేయడం తప్ప పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడంతో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు కాళోజీ కళాక్షేత్రం పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో పదేళ్ల పాటు కాళోజీ కళాక్షేత్రం అసంపూర్తిగానే ఉండిపోయింది. ఏ ఎన్నిక వచ్చిన ప్రతిపక్షాలకు ఇదొక అస్త్రంగా మాత్రమే ఉపయోగపడింది.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు పనులను సాగదీయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇక్కడి లీడర్లు కాళోజీ కళాక్షేత్రాన్ని సీరియస్ గా తీసుకున్నారు. ఈ మేరకు బడ్జెట్ అంచనాలు మార్పించి, రూ.90 కోట్లకు పెంచారు. ఆ తరువాత నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేయించారు. కాళోజీ కళాక్షేత్రం ఓపెనింగ్ ను ఛాలెంజింగ్ గా తీసుకున్న ఇక్కడి ఎమ్మెల్యేలు పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై మాత్రం పెద్దగా దృష్టి పెట్టలేదు. వేగంగా పూర్తి చేయాలని టార్గెట్లు పెట్టడం తప్ప పనుల నాణ్యతను ఎప్పుడూ పట్టించుకోలేదు. దీంతో ఆఫీసర్లు మాత్రం ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు పనులు స్పీడప్ చేయించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభానికి సిద్ధం చేశారు. మొదట కాళోజీ జయంతి సెప్టెంబర్ 9న ఓపెనింగ్ చేద్దామనుకున్నప్పటికీ.. ఆరోజు సీఎం టూర్ ఖరారు కాకపోవడంతో కళాక్షేత్రం ఓపెనింగ్ వాయిదా వేశారు. చివరకు నవంబర్ 19న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కాళోజీ కళాక్షేత్రాన్ని గ్రాండ్ గా ఓపెనింగ్ నిర్వహించారు.కాళోజీ కళాక్షేత్రం క్రెడిట్ కొట్టేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరాటపడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాక్షేత్రం భీములు, గోడలు బీటలు వారడంతో దాని భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు అందులో అధికారికంగా ఒకట్రెండు ప్రోగ్రామ్స్ మాత్రమే జరగగా.. ఓపెనింగ్ చేసిన నెల రోజుల్లోగానే లోపాలు బయటపడటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రెడిట్ కొట్టేసేందుకు ప్రజాధనాన్ని వృథా చేస్తారా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తుండగా.. కాళోజీ అభిమానులు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ఇప్పుడే పగుళ్ల బారిన పడగా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపడతారో చూడాలి.

# క్యాబినెట్ విస్తరణపై నో క్లారిటీ!

-మొదటిపేజీ తరువాయి

క్యాబినెట్ విస్తరణ ఊరిస్తూనే ఉంది. నెలలు గడుస్తున్నా విస్తరణ మాత్రం జరగడం లేదు. ప్రస్తుతం రేవంత్ క్యాబినెట్‌లో అదనంగా మరో ఆరుగురికి చోటు దక్కే అవకాశం ఉంది. ఈ ఆరు స్థానాల కోసం.. పదుల సార్లు.. అధిష్టానంతో చర్చోప చర్చలు.. మంతనాలు జరిగాయి. ఏడాది పూర్తైనా అదే సాగదీత.. అదే ఊరడింపు..సంక్రాంతికి అన్నారు. అంతలోనే ఉగాది తర్వాత చూద్దామన్నారు. ఇంతలోనే ఆషాఢ మాసం తెరపైకి వచ్చింది. అది పోగానే లోక్‌సభ ఎన్నికలు అడ్డొచ్చాయి. కొత్త పీసీసీ ప్రెసిడెంట్ ఎంపిక తర్వాత.. విస్తరణ పక్కా అంటూ ప్రచారం జరిగింది. చెప్పినట్లుగానే పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం పూర్తి చేసింది. ఇక అడ్డంకులన్నీ తొలగిపోయాయి. దసరా పండుగకు కొత్త మంత్రులు వస్తారని అధిష్టానం లీకులు ఇచ్చింది. కానీ ఆ లీకులకు అధిష్టానం పోకడలకు పొంతన లేదు. మొన్నటికి మొన్న దీపావళికి పక్కా అంటూ ఊరడించి ఊసురుమనిపించారు అధిష్టానం పెద్దలు. ఇంతలోనే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు రాగానే మళ్లీ ఢిల్లీ పెద్దలు సైలెంట్ అయ్యారు. ఆ రెండు రాష్ట్రాల ఫలితాలు వచ్చాయి ప్రభుత్వాలు కొలువుదీరాయి. ఐనా క్యాబినెట్ విస్తరణపై నో క్లారిటీ.



మంత్రివర్గంలో చోటు కోసం చాలా మంది ఆశావహులు కొండంత ఆశ పెట్టుకున్నారు. అందులో మాజీ మంత్రులతో పాటు సీనియర్ ఎమ్మెల్యేలు, జూనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎవరి లెవల్ లో వారు పైరవీలు చేసుకుంటూ వస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి అధిష్టానం వరకు విన్నపాలు చేసుకుంటున్నారు. దీంతో క్యాబినెట్ బెర్త్ కోసం పోటీ పడుతున్న వారి సంఖ్య భారీగానే ఉంది. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్, వివేక్ వెంకట స్వామి, ప్రేమ్ సాగర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వచ్చే నెల మరో 7 ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్‌కు లభించే అవకాశం ఉంది. ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యే ఒకరిద్దరు నేతలకు కూడా మంత్రివర్గంలో పదవి ఆశిస్తున్నారు. ఈ జాబితాలో షబ్బీర్ అలీ, పహీం ఖురేషీ పేర్లు వినిపిస్తున్నాయి.కేబినెట్ బెర్తులు ఆరు ఖాళీ ఉంటే పోటీ పడుతున్న నేతల సంఖ్య పదికి పైగా ఉంది. దీంతో మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు ఢిల్లీ పెద్దలకు బిగ్ టాస్క్‌గా మారిందట. మంత్రి పదవులు ఆశిస్తున్న ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉండటంతో అధిష్టానం ఎటూ తేల్చుకోలేక పోతోందని తెలుస్తోంది. దీనంతటికీ కారణం ఒక్కటే.. అనుకున్న శాఖలు రాకున్నా.. మంత్రి పదవి దక్కకున్నా అసంతృప్తి జ్వాలలు రగిలే అవకాశముంది. అందుకే ఎప్పటికప్పుడు వాయిదాలు వేస్తూ వస్తోందని ఆ పార్టీ ఇన్‌సైడ్ టాక్..అంతేకాదు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రుల సిఫారసులు కూడా హైకమాండ్‌కు తలనొప్పిగా మారాయంట.. కొందరు కర్ణాటక సర్కార్ పెద్దలతో కూడా సిఫార్సులు చేయిస్తున్నారని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి రికమండేషన్‌ను పరిగణలోకి తీసుకోవాలో తెలియక హైకమాండ్ పెద్దలు అయోమయంలో పడ్డారనేది కాంగ్రెస్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న చర్చ.. విభేదాలు, అలకలు లేకుండా సాఫీగా సాగిపోతున్న సమయంలో మంత్రివర్గ విస్తరణ చేసి లేని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకని ఢిల్లీ పెద్దలు వాయిదాల జపం చేస్తున్నారు. మరి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడని మంత్రి పదవుల ఆశావహులు గుర్రుగా ఉన్నారంట.. మరి హైకమాండ్ ఏం చేస్తుంది, ఈ సారైనా సీఎం హస్తిన టూర్ తీపి కబురుతో ముగుస్తుందో లేదో చూడాలి.

# అంతు చిక్కని రేవంత్ వ్యూహం

-మొదటిపేజీ తరువాయి

మార్మోగిపోతోంది. ఆయన హృదయాన్ని పలకరిస్తే.. మన మనసు పులకరించి పోవాల్సిందే. ఆయన నోటి వెంట జానపదాలు జలపాతాల్లా ప్రవహిస్తూనే ఉంటాయి. అలాంటి ఉద్యమ కళాకారుడిని పెద్దల సభకు పంపించింది బీఆర్ఎస్. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్‌కు ముద్రపడింది. ఆ ముద్రను తొలగించేందుకు ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న కీలక కళాకారుల్ని, ఉద్యమకారుల్ని కాంగ్రెస్ తన వైపు తిప్పుకునేందుకు ట్రై చేస్తోందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించి ఆ పాట రాసిన అందెశ్రీని తమ వైపు తిప్పుకోగలిగారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న గోరటి వెంకన్నకు ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించడంతో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో ఉన్న గోరటి వెంకన్న ఆ నజరానాను తీసుకుంటారా లేదా అని పెద్ద చర్చగా మారింది. ఓ కళాకారుడిగా తీసుకుంటే తప్పేంటని వాదించే వాళ్లు కూడా లేకపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే నజరానాలను తీసుకుంటే ఆ పార్టీకి విధేయులుగా మారిపోయినట్లేనని చర్చ కూడా జరుగుతుంది. నజరానా పుచ్చుకుంటే బీఆర్ఎస్ పెద్దలు ఈ విషయాన్ని సీరియస్‌గానే అవకాశం కూడా ఉంది.దీంతో ప్రభుత్వ నజరానా తీసుకోవాలా వద్దా అని గోరటి వెంకన్న డైలామాలో ఉన్నట్లు సమాచారం. గోరటి వెంకన్న ఎక్కడ చేజారిపోతారోనని బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయ్యింది. గోరటి వెంకన్నను కారు దిగకుండా చేసే బాధ్యతలను ఆయన సామాజికవర్గానికి చెందిన ఓ యువ నేతకు అప్పగించారు. దీంతో ఆయన రెండు, మూడ్రోజులుగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్నను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఎమ్మెల్సీ సొంత పనులపై బయటకు వెళ్లినా ఆ యువ నేత మాత్రం నీడలా వెంటే ఉంటున్నారట.గోరటి వెంకన్న కూడా ప్రభుత్వ నజరానా తీసుకోనని.. తీసుకుంటానని ఇప్పటి వరకు క్లారిటీ ఇవ్వలేదు. దీంతో గోరటి వెంకన్న నిర్ణయం ఎలా ఉండబోతుందని ఉత్కంఠ మొదలైంది. ఇప్పటికే గోరటి వెంకన్న బీఆర్ఎస్ పార్టీతో అంటిముట్టనట్లు ఉంటున్నారు. ఇప్పుడు సడెన్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నజరానా ప్రకటించడంతో గోరటి వెంకన్న ఎలా రియాక్ట్ అవుతారని పెద్ద టాపిక్ గా మారింది.

# సీవరేజ్ స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్ :** మరికొన్ని ఎస్టీపీలను ప్రారంభించేందుకు హైదరాబాద్ జలమండలి సిద్ధమవుతోంది. జనవరి నాటికి 9 ఎస్టీపీలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఇప్పటికే 11 ఎస్టీపీలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. కొత్త ఎస్టీపీల ప్రారంభంతో మూసీ నీటి ప్రక్షాళనలో మరో అడుగు ముందుకు పడినట్లు అవుతుంది.రానున్న జనవరి నాటికి హైదరాబాద్ నగరంలో మరికొన్ని సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు(ఎస్టీపీ) అందుబాటులోకి రానున్నాయి. ఆ దిశగా జల మండలి అడుగులు వేస్తోంది. పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కార్యాచరణను సిద్ధం చేసింది. నగరంలో మరో 9 ఎస్టీపీలు నిర్మాణ దశలో ఉన్నాయి.ఈ నిర్మాణలపై ఇటీవలే జల మండలి ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఎస్టీపీలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని.. జనవరి నాటికి పనులు పూర్తి అవ్వాలని ఆదేశించారు. సరిపడా కార్మికులను ఈ ఎస్టీపీల నిర్మాణానికి కేటాయించాలని నిర్మాణ సంస్థకు కూడా సూచించారు. వివిధ దశల్లో పనులు పూర్తి చేయడానికి నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తి కాకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.ఎస్టీపీల నిర్మాణంలోని వివిధ దశల పనులు అవకాశం ఉన్నంత వరకు సమాంతరంగా జరగాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. అనుకున్న సమయానికి ఎలెక్ట్రో మెకానికల్ ఈక్విప్మెంట్ సమకూర్చుకోవాలని? ఇందుకు గానూ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రెండు షిఫ్టుల్లో పనులు జరగాలని సూచించారు. ఎస్టీపీల నిర్మాణంలో భద్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని పేర్కొన్నారు. కార్మికులు కచ్చితంగా భద్రతా పరికరాలను వినియోగించేలా చూడాలని చెప్పారు. ఎస్టీపీల నిర్మాణం జరుగుతున్న ప్రదేశాల్లో తగు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.జలమండలి ఎస్టీపీ ప్రాజెక్టుల్లో నిర్మిస్తున్న వాటిల్లో.. ఇప్పటికే 11 ఎస్టీపీలు ప్రారంభమయ్యాయి. మరో 9 ఎస్టీపీలు నిర్మాణం దశలో ఉన్నాయి. వీటిలో డిసెంబర్ లో పాలపిట్ట, వెన్నల గడ్డ ఎస్టీపీలు పూర్తి కావాలన్నారు. జనవరిలో అంబర్ పేట్, ముల్లకత్వ చెరువు, శివాలయ నగర్, నలగండ్ల, అత్తాపూర్, రెయిన్ బో విస్తా, రామ చెరువు దగ్గర నిర్మిస్తున్న ఎస్టీపీలు ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.నిరంతర పకడ్బందీ పర్యవేక్షణతో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో మాట్లాడిన ఆయన? "సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ - హైదరాబాద్" లక్ష్యంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రారంభించామని 70 రోజులు పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని 50 శాతం చేరుకున్నట్లు తెలిపారు. బుధవారం నాటికి 12673 ప్రాంతాల్లో 1602 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్, 1.22 లక్షల మ్యాన్ హోళ్లలో పూడికతీత పనులు చేసినట్లు చెప్పారు. మురుగు నీటి నిర్వహణలో రోజూవారీగా ఉపయోగించే 220 ఎయిర్ టెక్ మిషన్లు, 146 సిల్ట్ తరలింపు వాహనాలు, సీవరేజ్ సిబ్బందినే ఇందులోనూ వాడుకునేలా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు.

# సంపాదకీయం

## సంస్కరణలు చేయూత ఎవరికి?

తమ 80వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ బ్యాంకు, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) వలస వారసత్వాలు సంస్కరణలు, రాడికల్ పునర్నిర్మాణం కోసం మరోసారి ఇటీవల పిలుపునిచ్చాయి. గ్లోబల్ సౌత్ / ప్రపంచంలోని అత్యధిక దేశాలలోని పౌరసమాజ సంస్థల నుండి వాటికి వ్యతిరేకంగా నిరసనల నేపథ్యంలో ఈ పిలుపునిచ్చాయి. వీటి కారణంగానే గ్లోబల్ సౌత్‌లో ఎక్కువ భాగం నేడు అప్పులలో కూరుకుపోయామనే భావన బలపడుతుంది. ఈ సంస్థలలో 'స్పష్టంగా' సమస్యాత్మక నాయకత్వం ఉంది. అవి ఎల్లప్పుడూ అమెరికా, ఐరోపా దేశాల ప్రయోజనాల పట్లనే దృష్టి సారిస్తున్నాయి. 1949లో, అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రూమాన్ తన 'పాయింట్ ఫోర్' ప్రసంగంలో, అమెరికా కేంద్రీకృత ప్రపంచం వైపు చరిత్ర గమనాన్ని రూపొందించిన 'అభివృద్ధి' గురించిన ప్రభావవంతమైన దృష్టిని ప్రవేశపెట్టారు. ట్రూమాన్ ప్రసంగం గ్లోబల్ సౌత్‌ను 'అభివృద్ధి చెందని'దిగా రూపొందించింది. ఈ దేశాలకు పారిశ్రామికీకరణ, ఆర్థిక విస్తరణ ద్వారా పాశ్చాత్య శైలి ఆధునికీకరణ అవసరమని సూచిస్తుంది. పెట్టుబడులు, సాంకేతిక మద్దతు ద్వారా ఈ దేశాలకు 'అభివృద్ధి చెందడానికి' అమెరికా సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. ఈ వాక్చాతుర్యం అభివృద్ధి నమూనా కోసం సైద్ధాంతిక పునాదిని స్థాపించింది. ఇది పారిశ్రామికంగా లేని, వనరులు సమృద్ధిగా ఉన్న, చారిత్రాత్మకంగా వలస రాజ్యాల దేశాలను 'వెనుకబడినవి'గా పరిగణించింది. పాశ్చాత్య జోక్యం వారి పురోగతికి అవసరమైనదిగా చిత్రీకరించింది. 2020 లో ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్అండ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ జాసన్ హికెల్ ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ గ్లోబల్ గవర్నెన్స్‌లో 'ఆర్థిక వర్ణవివక్ష' ని కొనసాగించే వలసవాద శకం సూత్రాలలో పాతుకుపోయిన సంస్థలుగా అభివర్ణించారు. ఈ రెండు సంస్థలు అసమానత, పేదరికం, ఆర్థికంగా ఆధారపడటానికి ఆజ్యంపోసే నయా –ఉదారవాద నిర్మాణ సర్దుబాటు కార్యక్రమాలతో బాధపడుతున్న గ్లోబల్ సౌత్‌ను అట్టడుగుకు నెట్టివేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రధానంగా అమెరికా, ఐరోపా దేశాలను అసమానంగా బలపరుస్తాయని ఆయన వాదించారు.ప్రొఫెసర్ హికెల్ ఈ సంస్థలలో ఓటింగ్ శక్తిలో అసమతుల్యత గురించి అంతర్ దృష్టిని ఇచ్చారు (ఉదా. బంగ్లాదేశ్ ఓటు కంటే 41 రెట్లు అధికంగా ఉన్న బ్రిటిష్ ఓటు). బ్రెట్టన్ వుడ్ కాన్ఫరెన్స్‌లో 1944లో జన్మించిన ఈ సంస్థలను ప్రధానంగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో పునర్నిర్మాణానికి సహాయం చేయడానికి రూపొందించారు. ఆర్థిక వ్యవస్థలను స్థిరీకరించేందుకు, అభివృద్ధిని వేగవంతం చేస్తామని సంస్థలు ప్రతిజ్ఞ చేశాయి. పశ్చిమ ఐరోపాకు విదేశీ నిధులను అందించడానికి అమెరికా స్థాపించిన మార్షల్ ప్లాన్ నుండి పోటీ కారణంగా నెమ్మదిగా అభివృద్ధి చెందుతున్న దేశాల వైపు దృష్టి మళ్ళింది. ఆ తర్వాత భారత దేశం, గ్లోబల్ సౌత్‌లో చాలా వరకు, ఈ ఆర్థిక సంస్థలు నయా ఉదారవాద విధానాలను అమలు చేసే సాధనాలుగా పరిగణనపొందాయి. అయితే ఈ రెండు ప్రపంచ ఆర్థిక సంస్థల నుండి మద్దతు పొందిన దేశాలు, సమాజాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడం, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించలేకపోవడం సర్వత్రా కనిపిస్తున్నది. భారతదేశ గ్రామీణ ప్రాంతాల నుండి ఆఫ్రికాలోని సంఘర్షణ ప్రాంతాల వరకు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ప్రభావం గల ఖండాలు, ఆర్థిక వ్యవస్థలు, సిద్ధాంతాలు విస్తరించి ఉన్నాయి.1990వ దశకం ప్రారంభంలో భారత ప్రభుత్వం ఐఎంఎఫ్ రుణ పరిస్థితుల ద్వారా ఒత్తిడికి గురైంది. నిర్మాణాత్మక సర్దుబాటు కార్యక్రమాలను స్వీకరించింది. మనం నేడు ఉదార ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన ఘనులుగా భావిస్తున్న పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ వంటి వారు స్వతహాగా ఉదారవాద విధానాలపట్ల నమ్మకం, అవగాహన ఉన్నవారు కాదని, ఈ రెండు సంస్థల షరతులకు తలవంచి, తమ ద్రవ్య సర్దుబాటుకోసం విచ్చలవిడిగా రుణాలు తీసుకోవడం ప్రారంభించిన వారేనని ఈ సందర్భంగా గమనించాలి. సబ్సిడీలను తగ్గించడం, మార్కెట్లను నియంత్రించడం, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడంలను ఆధునీకరణకు మార్గాలుగా వీరు చిత్రీకరించారు. కానీ మహారాష్ట్రలోని రైతులకు, 'ఆధునీకరణ' అంటే వారు అకస్మాత్తుగా కార్పొరేట్ అగ్రి బిజినెస్‌లతో పోటీపడవలసి వచ్చింది. తరచుగా అదానీ, అంబానీ వంటి శక్తివంతమైన భారతీయ కార్పొరేట్‌ల ముందు తలవంచాల్సి వచ్చింది. భారతదేశంలో, అనేక ప్రపంచ బ్యాంకు ఆర్థిక ప్రాజెక్టులు నీరు, ఇంధనం కార్యక్రమాలను సులభతరం చేయడానికి ప్రజలను స్థానభ్రంశం చేశాయి. తరచుగా ప్రభావిత జనాభా జీవనోపాధిని విస్మరిస్తారు. పర్యావరణ సమస్యలపట్ల ప్రపంచ బ్యాంకు విధానంలో కూడా ఈ వలస వారసత్వం కనిపిస్తుంది. అటవీ నిర్మూలన, భూమి క్షీణత, జీవవైవిధ్య నష్టానికి దోహదపడే శిలాజ ఇంధన ప్రాజెక్టులు, అగ్రిబిజినెస్ వెంచర్‌లకు నిధులు సమకూర్చినందుకు విమర్శలను ఎదుర్కొంది. కొన్ని ఒత్తిడుల కారణంగా ఇటీవల కాలంలో క్లైమేట్ ఫైనాన్సింగ్ పునరుత్పాదక ఇంధనం, విపత్తు తట్టుకునే ఇంధనంపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ, అంతర్లీన ఆర్థిక నమూనా కార్బన్ వాణిజ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి మార్కెట్ ఆధారిత పరిష్కారాలకు ప్రాధాన్యతనిస్తూనే ఉంది. ప్రపంచ బ్యాంకు షరతులపై రుణాలు ఇవ్వడం ద్వారా ప్రపంచ పర్యావరణ సంక్షోభాలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొంది. ఇది తరచుగా మార్కెట్‌కు ప్రయోజనం చేకూర్చే నమూనాలను విధించడం ద్వారా పర్యావరణ హానిని పునరావృతం చేయడం, సామాజిక అసమానతలను తీవ్రతరం చేయడం ద్వారా కూడా దోహదపడుతుంది. నేడు సంపన్న దేశాలైన అమెరికా, ఐరోపా ఆర్థికంగా అనేక సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. వారు అనుసరిస్తున్న ఆర్థిక, అభివృద్ధి నమూనాలు ప్రశ్నార్థకం అవుతున్నాయి. కానీ, అటువంటి నమూనాలను రుణాలకు షరతుల పేరుతో తమ ప్రయోజనాలకు అనువుగా ఉండే విధంగా గ్లోబల్ సౌత్ దేశాలపై రుద్దే ప్రయత్నం ఈరెండు సంస్థలు చేస్తున్నాయి. ఈ రెండు సంస్థల నుండి రుణాలు తీసుకోవడం ప్రారంభమైన తర్వాతనే భారత దేశంలో ఆర్థిక అసమానతలు గణనీయంగా పెరుగుతూ ఉండటం, ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం, గ్రామీణ– పట్టణ అంతరాలు పెరగడం, వ్యవసాయ– గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు సంక్షోభాలలో చిక్కుకోవడాన్ని మనం చూస్తున్నాము. 80వ వార్షికోత్సవంలో ప్రవేశిస్తున్న ఈ రెండు సంస్థలు ప్రతిపాదించే నమూనాలు పర్యావరణానికి హానికరమైనవి. పైగా, దోపిడీ, హింసాత్మక ప్రవృత్తికి దోహదకారి అయినవని గమనించాలి. ఈ సంస్థలు స్థానికంగా కలిగించే వృద్ధి కంటే పాశ్చాత్య ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తాయి. గ్లోబల్ నార్త్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే ప్రపంచ సోపానక్రమాన్ని బలోపేతం చేస్తాయి. బహుళజాతి సంస్థలకు, సంపన్న దేశాలకు సేవలందించే ఒక ఎజెండాను ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ బ్యాంకు అనేక దేశాలను శాశ్వతమైన పరాధీనత, రుణ ఉచ్చులలో ఉంచే ఆర్థిక వ్యవస్థను శాశ్వతం చేసింది. ప్రజలు, సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు, ప్రకృతిపై వారు విధ్వంసం చేసినప్పటికీ, ప్రపంచ బ్యాంక్, ఐఎఫ్ఎఫ్ ఎటువంటి జవాబుదారీతనం వహించడం లేదు. వారి సంబంధిత వ్యవస్థాపక చార్టర్‌లు వారికి చట్టపరమైన, వస్తుపరమైన జవాబుదారీతనం నుండి పూర్తి నిరోధక శక్తిని అందిస్తాయి. ఆచరణలో అవి అక్షరాలా చట్టానికి అతీతమైనవి. సామాజిక రక్షణ విధానాలు వాటి విధానాలు, కార్యకలాపాలను ఏ అర్థవంతమైన పద్ధతిలో మార్చలేవు. ప్రజాస్వామిక, వికేంద్రీకృత ఆర్థిక పాలన సూత్రాలపై స్థాపించిన కొత్త సంస్థల ద్వారా, సమానత్వం, సుస్థిరత, అన్ని దేశాల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, ఎంపిక చేసిన కొన్నింటికి మాత్రమే కాకుండా, మనకు ప్రాథమిక నమూనా మార్పు అవసరం. ఈ కొత్త సంస్థలు నిజంగా సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉండాలి. ముఖ్యంగా ఆర్థిక, సామాజిక అభద్రత భారాన్ని భరించే వారి అన్ని స్వరాలు వినిపించేలా ఉండాలి. ప్రపంచంలోని అత్యంత పేద, అత్యంత బలహీనమైన జనాభా అవసరాలను తీర్చడానికి విధానాలు రూపొందించాలి. వారు మానవ హక్కులలో పొందుపరిచిన అభివృద్ధి విధానాలను ప్రోత్సహించాలి, పర్యావరణాన్ని పరిరక్షించాలి. భవిష్యత్ తరాలవారు గౌరవంగా, సామరస్యంగా, శాంతితో జీవించే సామర్థ్యాలను నిర్ధారించాలి. కొత్త సంస్థలు నిజమైన రుణ ఉపశమన కార్యక్రమాలకు అత్యవసరంగా మద్దతు ఇవ్వాలి. రుణాలపై ఆధారపడే విషచక్రాల నుండి దేశాలు విడిపోవడానికి సహాయపడే అనుకూలమైన ఫైనాన్సింగ్‌ను అందించాలి.

# బయోఫ్యూయెల్‌కు ప్రోత్సాహం ఏదీ?

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది.మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు.అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్న మైంది.పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది.కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బ్యురేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను




వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ఔజ వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు.నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

# రాజీఎరుగని పోరాట యోధుడు

భారత దేశంలో ప్రముఖ కమ్యూ నిస్టు నేతల్లో మాకినేని బసవ పున్నయ్య ఒకరు. విద్యార్థి సంఘం నేతగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానంలో తొలుత కాంగ్రెస్ లోనే ఓనమాలు దిద్దుకున్నారు. అనంతరం కమ్యూనిస్టు భావాలు ఆకర్షించడంతో సీపీఐలో చేరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అనంతరం సీపీఎం ఆవిర్భా వంలో కీలక పాత్ర పోషించారు. ఆ క్రమంలో ఆయన అంతర్జాతీయ స్థాయి కమ్యూనిస్టు నేతలైన స్టాలిన్, మాలటోవ్, సుస్లోవ్, మాలెంకోవ్‌లతో చర్చలు జరిపారు. అలాగే చైనా కమ్యూనిస్టు దిగ్గజాలు మావోసేటుంగ్, చౌఎన్‌లై తోనూ పున్నయ్య సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. 1952 నుంచి 1966 వరకు రాజ్యసభ సభ్యునిగా పని చేశారు. కార్ల్‌మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి, జీవితాంతం రాజీ ఎరగని పోరాట యోధునిగా నిలిచిపోయారు. కామ్రేడ్ బసవ పున్నయ్య రేపల్లె మండం తూర్పుపాలెం లోని భూస్వామ్య కుటుంబంలో 1914 డిసెంబరు 14న జన్మించారు. తల్లి దండ్రులు చారుమతి, అప్పయ్య. భార్య జగదాంబ. ప్రారంభంలో సాంప్రదాయ విద్య, అనంతరం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివి, బందరు నోబుల్ కళాశాలో ఇంటర్మీ డియట్, గుంటూరు ఎ.సి. కాలే జీలో బి.ఎ.పూర్తి చేశారు. 1930లో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన నాటి తరం నేతలతో కలిసి పనిచేసి అనుభవాలను పంచుకున్నారు. ఆనాడు కాంగ్రెస్ నాయకత్వం ఉద్యమాన్ని తాత్కాలికంగా రద్దు చేయటంతో అసంతృప్తి చెంది బసవ పున్నయ్య ప్రజల సమస్యలు సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే పరిష్కారం కాగవన్న విశ్వాసంతో 1934 –35లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. గుంటూరులో జరిగిన విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించి, సహ విద్యార్థులైన వై.వి.కృష్ణారావు, మాద నారాయణ స్వామి, మోటూరు హనుమంత రావు, లావు బాగంగాధర రావుతో కసి రాష్ట్రంలో బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి, 1938లో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, అదే సమ యంలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ సహాయ కార్యదర్శిగా పని చేశారు. 1940లో గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా బాధ్యతను స్వీకరించారు. 1943లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుగా ఎన్నికై నారు.1948లో కలకత్తాలో జరిగిన సి.పి.ఐ. ద్వితీయ మహాసభలో కేంద్ర కమిటికి ఎన్నికయ్యారు. 1964లో పార్టీ చీలిన తరువాత సి.పి.ఐ.(ఎం) పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆ స్థానంలో నాలుగు దశాబ్దాల పాటు తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగారు. మార్క్సిజం లెనినిజంకు చివరి వరకు కట్టుబడి ఉండి పీడిత ప్రజ విముక్తి కోసం విశిష్టమైన సేవందించారు. నిర్ధిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట విశ్లేషణను చేయగలిగిన మార్క్సిజం లెనినిజం అనే సజీవ



సిద్ధాంత వ్యాప్తికి, భారతదేశ ప్రజ విముక్తికి గణనీయమైన సేవలందించారు. తెలంగాణ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులో కామ్రేడ్ మాకినేని ఒకరు. తెంగాణా సాయుధ పోరాటంలో కామ్రేడ్స్ సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు మొదలైన ప్రముఖులతో పాటు కీలక పాత్రను పున్నయ్య పోషించారు. తెలంగాణ పోరాట నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణ, ఆయుధాల కోనుగోలు, చేరవేతలో ప్రధాన భాధ్యత బసవ పున్నయ్యదే. సాయుధ పోరాటాన్ని విరమించి విప్లవ మార్గాన్ని చేపట్టటంలో సుందరయ్యతో పాటు బసవ పున్నయ్య సృజనాత్మక పాత్ర నిర్వహించారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగణ్యులైన నాయకులో ఒకరుగా ఎదిగారు. రహస్య జీవనం సాగించిన సందర్భం, ప్రభుత్వం దమన కాండకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన అనుభవాల సాయంతో భారత దేశంలో విప్లవ సాధనకు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చర్చను ప్రారంభించిన వారిలో ఒకరిగా, సిపిఎం విప్లవకర వ్యూహ్యాన్ని చేపట్టడంలో కామ్రేడ్ బసవ పున్నయ్య కీలక పాత్రధారి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంతపరంగా తీవ్రస్థాయిలో చర్చ సాగిన కాలంలో ఈ అంశంపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులతో చర్చ జరిపే బాధ్యతను పార్టీ కేంద్రకమిటీ కామ్రేడ్ మాకినేనికి అప్పగించింది. మాస్కోలో 1957లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ మహా సభలకు వెళ్ళిన సి.పి.ఐ. ప్రతినిధి వర్గంలో ఆయన సభ్యులు.నాడు దేశంలోనూ, అంతర్జాతీయంగానూ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొం టున్న సమస్యపై మావోసేటుంగ్ తోనూ, లీషావ్‌చి నాయకత్వంలో వచ్చిన చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందంతోనూ చర్చజరిపే అవకాశం కామ్రేడ్ ఆయనకు లభిం చింది. శాస్త్రీయమైన, విప్లవకర మార్క్సిజం లెనినిజం సిద్ధాతం పట్ల నిబద్ధతతో కూడిన దేశభక్తి ప్రపూ ర్ణుడు బసవ పున్నయ్య.భారత విప్లవ మార్గానికి స్వతంత్ర వ్యూహా లను, ఎత్తు గడలను అన్వేషించి ప్రజలకు విప్లవ మార్గాన్ని సూచిం చారు. విప్లవ సాధనకు వ్యూహాన్ని రూపొందించే వారు. పీడిత ప్రజల విముక్తి కోసం సైద్ధాంతికంగా, ఆచర ణాత్మకంగా గణనీయమైన కృషి చేస్తూనే పార్లమెంటేరియన్ గానూ రాణించారు.రాజ్యసభ సభ్యుడిగా 1952 నుంచి 1966 వరకు 14 ఏళ్లు కొనసాగారు. బసవ పున్నయ్య ఆరేళ్ల పాటు అజ్ఞాత వాసం సాగించారు. చైనా భారత్ యుద్ధం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను రెండుసార్లు జైల్లో పెట్టింది . చైనా భారత దేశాల మధ్య వివాదాన్ని సంప్రదింపులు, చర్చల ద్వారా మాత్రమే పరిష్క రించు కోవాలని, ఘర్షణ ద్వారా కాదని నొక్కి చెప్పారు. సి.పి.ఐ.(ఎం) ఆవిర్భావం నాటి నుంచి చని పోయే వరకూ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుగా పనిచేసిన కామ్రేడ్ మాకినేని పూర్వపు సోషలిస్టు దేశాల్లో సంభవించిన మార్పుకు సంబంధించి చేసిన సిద్ధాంత పరమైన సూత్రీకరణల్లో క్రియాశీక పాత్ర నిర్వహించారు. 1990లో సోవియట్ యూనియన్ కుప్ప కూలి, సోషలిష్టు సిద్ధాంతం పైనే దాడి కేంద్రీకరించ బడినా సడలని కమ్యునిస్టు విశ్వాసాన్ని నిలిపిన ధీరుడు బసవ పున్నయ్య. సి.పి.ఐ.(ఎం) అధికార పత్రిక పీపుల్స్ డెమోక్రసీ ఎడిటర్‌గా ఆయన 14 ఏళ్లు పనిచేశారు. సి.పి.ఐ.(ఎం) అభివృద్ధికి, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి వయసుతో నిమిత్తం లేకుండా అవిశ్రాంతంగా కృషిచేశారు. మాకినేని నిరంతరం చదివేవారు, విస్తృతంగా రాసే వారు. కార్యకర్తలు, ఢిల్లీ కార్యాలయం సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేసేవారు. అందుకే ఆయన్ను అందరూ ఎంతో అభిమానించే వారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు సైద్ధాంతిక, వ్యక్తిగత సమస్యపై చర్చించేందుకు అయన అందరికీ ల్లప్పుడూ అందుబాటులో ఉండేవారు. బసవ పున్నయ్య గొప్ప ఉపన్యాసకులు. సునిశితమైన రచయితగా అనేక సిద్ధాంత పత్రాలను రచించారు. ఆయనలో మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాత పరిజ్ఞానంతో పాటు అంతర్జా తీయత, దేశభక్తి, తెలుగు జాతీయత కలగలిపి ఉండేవి. విప్ల వోద్యమం కోసం కామ్రేడ్స్ సుంద రయ్య, రాజేశ్వరరావు మున్నగు వారితో సహా, తమ వ్యక్తిగత ఆస్తు లను అమ్మి పార్టీకి ఇచ్చినవారిలో కామ్రేడ్ బసవ పున్నయ్య ఒకరు. కామ్రేడ్ బసవ పున్నయ్య ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాయంలో పార్టీ పనిలో ఉంటూనే 1992 ఏప్రిల్ 12వ తేదీన మరణించారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి.






**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**అలరించిన సైన్స్ ఫెయిర్.**
**రామగుండం,ఎన్టిపిసి లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను**
**తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**

**రామగుండం/పెద్దపల్లి,డిసెంబర్13(సూర్యరేఖ)**ఁప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం ఎన్టిపిసిలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించిన సైన్స్ ఫెయిర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ...సైన్స్ ఫెయిర్ లో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.పాఠశాలకు విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన ఆహారం భోజనంగా అందించాలని,ఎటువంటి పొరపాట్లు జరగడానికి వెళ్లలేదని కలెక్టర్ అధికారులకు సూచించారు.పాఠశాలల్లో విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన వినోదం ఉండాలని,సైన్స్ ఫెయిర్ నిర్వహణ, పర్యాటక ప్రాంతాల చదవాల్సిన వంటి కార్యక్రమాలను ప్లాన్ చేయడం చాలా మంచిదని కలెక్టర్ తెలిపారు.అనంతరం రామగుండంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్,విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి,జిల్లా సైన్స్ అధికారి రఘునందన్ రావు, మండల విద్యాశాఖ అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 18వ మహా పడిపూజ మహోత్సవం








**నిజాంపేట,డిసెంబర్13(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ ఎల్లమ్మ తల్లి దేవాలయ ఆవరణలో శుక్రవారం గురుస్వామి నాతి లక్ష్మగౌడ్ 18వ పడి పూజ మహోత్సవం కార్యక్రమాన్ని గురుస్వాములు బాలు,భీమయ్య,రెడ్డిశెట్టి రవీందర్, ఎర్రగౌడ్,లఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...లక్ష్మా గౌడ్ 18వ పడిపూజ కార్యక్రమాన్ని శబరిమల ధర్మశాస్త్ర ఆశీస్సులతో అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. శబరి యాత్ర ఒకసారి చేయడమే సాహసం అలాంటిది 18 సార్లు శబరి యాత్ర పూర్తి చేసుకుని పరిపూర్ణమైనటువంటి స్వామిగా కొలువ బడుతున్నట్టువంటిదే శబరిమల యొక్క సాంప్రదాయమన్నారు.ఆ అయ్యప్ప స్వామివారి అనుగ్రహం అందరిపై ఉండాలన్నారు.ఈ అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం స్వామియే శరణమయ్యప్ప అంటూ భక్త భజన సంకీర్తనలతో అయ్యప్ప స్వాములు ఆటపాటలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. అనంతరం అయ్యప్ప స్వాములు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గురు స్వాములు మండల తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,వెంకట స్వామిగౌడ్,తీగల శ్రీనివాస్ గౌడ్, నాతి వంశీగౌడ్,రంజిత్ గౌడ్,యాదగౌడ్,చంద్రమౌళి, కృష్ణమూర్తి, కృష్ణగౌడ్,బుర్ర సంతోష్ గౌడ్,వీరమల్లు బాలయ్య,నాయిని వెంకటేశం, అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదు

**కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు మీ స్థాయి ఏంటో తెలుసుకోవాలి..**
**విలేకరుల సమావేశంలో పాల్గొన్న నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు..**




**నిజాంపేట,డిసెంబర్13(సూర్యరేఖ)** పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చెయ్యని అభివృద్ధి పనులు ఏడాది కాలంలోనే సీఎం రేవంత్ రెడ్డి,మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేసి చూపించారని నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు మన స్థాయి ఏంటో చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని అనడం సిగ్గుచేటు అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలలో నాలుగు గ్యారెంటీలు అమలు అయ్యాయని మిగతా రెండు గ్యారెంటీలను త్వరలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు.గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నీళ్లు నిధులు నియామకాలు అని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు, నిరుద్యోగులను నట్టేట ముంచిందన్నారు.మీ ప్రభుత్వంలో సామాన్య మానవునికి లబ్ధి చేకూరలేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వారికి నచ్చిన నాయకులకే బీసీ బందు,దళిత బంధు,ట్రాక్టర్లను అందించడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.బీఆర్ఎస్ హయాంలో ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారో చూపించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట కట్టుబడి ఉండి రైతులకు చేస్తానన్న మాట నిలబెట్టుకొని రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు అందించకుండా కాలయాపన చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ కాదా ప్రశ్నించారు.75 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు.రానున్న స్థానిక ఎన్నికలలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామ పంచాయతీ సంబంధించి ఎంపీటీసీ, జెడ్పిటిసి,లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుతి,పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, సత్యనారాయణరెడ్డి,లింగంగౌడ్, మాజీఉప సర్పంచ్ కొమ్మాట బాబు,యూత్ అధ్యక్షులు రామచంద్రనాయక్,రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,మసూద్ అలీ,బాజా రమేష్, భాస్కర్ గౌడ్,శ్రీనివాస్ నాయక్,రాజు నాయక్,సామల రమేష్, రాజేందర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో మళ్లీ మొదలైన వానరాల బెడద



**నిజాంపేట,డిసెంబర్13(సూర్యరేఖ)**మండల కేంద్రంలో వానరాల బెడద మళ్లీ మొదలైంది.గతంలో కాంగ్రెస్ నాయకుల చొరవతో గ్రామస్తుల సహకారంతో చందాలు వేసి కోతులను పట్టించి అడవులలో వదిలేశారు.రెండు మూడు నెలల నుండి సంతరించిన కోతులు మళ్లీ గ్రామంలోకి రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కోతుల బెడదకు ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.కోతులు ఇండ్లల్లోకి దూరి తిను బండారాలు ఎత్తుకెళ్లడం జరుగుతుంది.కోతుల కొట్టే సమయంలో ప్రజలపై తిరగబడుతున్నాయి.ఈ కోతుల బెడద నుండి విముక్తి కల్పించాలని గ్రామ ప్రజలు కోరుచున్నారు.

## వ్యవసాయ భూములలో నిఘా నేత్రాలు




**నిజాంపేట,డిసెంబర్13(సూర్యరేఖ)** రోజురోజుకు మారుతున్న కాలానికి అనుగుణంగా మానవులు మారుతున్నారు.నాడు పరిశ్రమలు ఇంటి వద్ద ఏర్పాటు చేసుకునే సీసీ కెమెరాలు నేడు వ్యవసాయ క్షేత్రంలో కూడా సీసీ కెమెరాలు అమర్చుకోవడం జరుగుతుంది.ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఇబ్రహీం తన వ్యవసాయ పొలంలో సోలార్ సీసీ కెమెరాలను అమర్చుకోవడం జరిగింది.అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఈ చిత్రాన్ని చూసి ఆచార్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఏది ఏమైనాప్పటికీ సీసీ కెమెరాలు ఏర్పాటుతో రోడ్డుపై వెళ్లే వాహనాలతో పాటు పంట చేనులోకి వచ్చే వ్యక్తులు కూడా కెమెరాలో గుర్తించబడుతున్నారు.60 సంవత్సరాలు ఉన్న ఇబ్రహీం ఇలాంటి ఆలోచనకు పూనుకోవడం సాహసమనే చెప్పాలి.వ్యవసాయ క్షేత్రాల వద్ద పంటను రక్షించుకోవడానికి పంటను కాపాడుకోవడానికి రక్షణ కవచకంగా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని రైతు ఆయన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.


## శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే..

**సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలి..**
**సర్వేను పరిశీలించిన తాజా మాజీ సర్పంచ్**
**బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్**



**కొల్చారం,డిసెంబర్ 13(సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండల పరిదిలోని చందాయిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే శరవేగంగా కొనసాగుతుందని తాజా మాజీ గ్రామ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్ తెలిపారు. శుక్రవారం చందాయిపేటలో ఇందిరమ్మ గ్రామ కార్యదర్శి రాధాతో కలిసి ఇండ్ల సర్వే సర్వేయర్లు యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని యాప్ లో ఏమైనా సమస్యలు ఏర్పడినట్లైతే సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యలను నివృత్తి చేసుకొని ఇందిరమ్మ కమిటీలకు సమాచారం అందించి సర్వే నిర్వహించాలన్నారు. గ్రామంలో సొంతింటి కల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదల్లో ఆశలు చిగురిస్తున్నాయన్నారు.సర్వే నిర్వహణకు వచ్చిన సర్వేయర్లకు ప్రజలు సంబంధిత పత్రాలు అందించి సహకరించాలన్నారు.క్షేత్రస్థాయిలో అసలైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాధా,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మొజామిల్,గ్రామ సినియర్ నాయకులు బైండ్ల శివరాజయ్యా,బాసరాజు,దండు మహేష్, సాయిబాబా, ఎరుకల రాజు,ఎరుకల బిక్షపతి, మహేష్,తదితరులు పాల్గొన్నారు..

## మీసాల తండాలో జ్యోతి జైపాల్ నాయక్ అన్నదానం..



**ఇబ్రహీంపట్నం,డిసెంబర్13(సూర్యరేఖ)** అన్నదానం మహాదానమని స్వాములకు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ నేనవత్ జ్యోతి జైపాల్ నాయక్ అన్నారు.శుక్రవారం యాచారం మండల పరిధిలోని కేస్లి తండా అనుబంధ గ్రామమైన మీసా తండాలోనీ ఆంజనేయ స్వామి ఆలయంలో పోస్టల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు జైపాల్ నాయక్ ఆధ్వర్యంలో హనుమాన్ గాయత్రీ మాహాయజ్ఞం ఏర్పాటుచేసి భక్తిశ్రద్ధలతో అయ్యప్ప, ఆంజనేయ స్వామి స్వాములతో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు.స్వాములకు సేవలందించడంతో సంతృప్తి కలిగిందనీ అన్నారు. ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సాయం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

# మెరుగైన సేవలకే..జీఐఎస్ సర్వే





**జీఐఎస్ సర్వే..మెరుగైన పౌరసేవల కోసమే..**
**భవనాలు,యుటిలిటీల వివరాలు మాత్రమే సేకరణ..**
**సులువుగా సేవలు పొందే అవకాశం..**
**ప్రజలు ఎలాంటి అపోహలకుగురికావొద్దు.. సర్వేకు సహకరించాలి**
**రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే. రవికుమార్**

**రాజేంద్రనగర్,డిసెంబర్ 13** మెరుగైన పౌర సేవలు, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, వనరుల నిర్వహణ కోసమే జీఐఎస్ సర్వే చేస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ స్పష్టం చేశారు.శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మైలార్ దేవులపల్లి,సులేమాన్ నగర్ డివిజన్ల కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మైలార్ దేవులపల్లి డివిజన్ అధ్యక్షుడు ధనంజయ,వివిధ పార్టీల నాయకులతో కలిసి ఇంటింటికీ ఆస్తుల సర్వే "నియో-జియో" ఏజెన్సీల, రాజేంద్రనగర్‌లో ఇందిరమ్మ ఇండ్లు,సర్వే కార్యక్రమం గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై వివరించారు.అనంతరం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మాట్లాడుతూ. సర్కిల్ పరిధిలో కేవలం భవనాలు,రహదారులు,ఆస్తుల గుర్తింపునకు మాత్రమే ఈ సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో చేస్తున్న జీఐఎస్ సర్వే ద్వారా ఎలాంటి ఆస్తి పన్ను పెంపు ఉండదని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ తెలిపారు. జీఐఎస్ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి డిజిటల్ డోర్ నంబర్ ఏర్పాటు చేస్తారని వివరించారు.ప్రతి ఇంటి ఎదుట జీఐఎస్ డిజిటల్ బోర్డు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు.దేశానికి మోడల్?గా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రయోగాత్మకంగా ఈ సర్వే చేస్తున్నట్లు వివరించారు. ఈ సర్వే పూర్తయ్యాక వంద రకాల సేవలు ఇంటి ముందుకే వస్తాయని వెల్లడించారు.సర్వే ఉద్దేశాన్ని వివరించి సర్కిల్ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఆస్తి పన్ను మదింపుతోపాటు సర్కిల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన జీఐఎస్ సర్వే వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.నిర్మాణాలు,భవనాలు, రహదారులు,ఆస్తులను గుర్తించేందుకు మాత్రమే సర్వే చేస్తున్నామని స్పష్టం చేశారు. డ్రోన్ సర్వే, శాటిలైట్ చిత్రాల పరిశీలనతో పాటు క్షేత్రస్థాయిలో సిబ్బంది సమాచారం సేకరిస్తారని చెప్పారు. ఆధార్, పాన్ వంటి పౌరుల వ్యక్తిగత సమాచారం తీసుకోవడం లేదని,సిబ్బంది అడిగినా ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించారు. ఇందుకోసం యజమానుల నుంచి బలవంతంగా ఎలాంటి ఆధారాలు సేకరించడం లేదని, అనధికారిక,అధికార నిర్మాణాల ప్రస్తావన లేకుండా సర్వే చేస్తున్నట్లు వివరించారు.

**ఆస్తి పన్ను పెంపు ఉండదు :**

ఇంటింటి సర్వే ద్వారా ఆస్తి పన్ను పెంపు ఉండదని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె రవికుమార్ స్పష్టం చేశారు. ఆస్తి పన్ను పెంపు ప్రభుత్వం తీసుకునే నిర్ణయమని పేర్కొన్నారు.కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్వే నిర్వహించడం వల్ల జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ఆస్తులు, యుటిలిటీస్ మ్యాప్ చేయడానికి ఈ సర్వే దోహదపడు తుందన్నారు. ఆస్తులు బహిర్గతం కాదని,ప్రజల నుంచి సేకరించిన వివరాలు కూడా అత్యంత భద్రంగా ఉంచుతామని కమిషనర్ తెలిపారు.సామాన్యుల నివాసాల నుంచి కాకుండా వ్యాపార, వాణిజ్య కేంద్రాల నుంచి వాస్తవ ఆస్తి పన్ను రాబడతామని తెలిపారు.

**ఒకే సర్వే పలు రకాల సేవలు :**

జీఐఎస్ సర్వే ద్వారా ప్రజలకు ప్రభుత్వ పరంగానే కాకుండా ప్రైవేటుగానూ ఎన్నో రకాల సేవలందుతాయని కే.రవికుమార్ వివరించారు.సర్వే పూర్తయ్యాక ప్రతి అంశం మ్యాపింగ్ జరుగుతుందని,తద్వారా వీధుల్లో విద్యుత్ దీపాల దగ్గరి నుంచి చెత్త సేకరణ వరకు ప్రతి అంశం జీహెచ్ఎంసీకి సమగ్ర వివరాలు అందుతాయన్నారు. ఆస్తి పన్ను మదింపులోనూ చాలా సులభతరం అవుతుందన్నారు. అలాగే ఇంటింటికి ప్రత్యేకంగా డిజిటల్ డోర్ నెంబర్ ఇస్తామని,దానిపై ఉన్న క్యూఆర్ కోడ్ వల్ల ఆ ఇంటికి లేదా వీధిలో ఎలాంటి సేవలందాయనే విషయాలు క్షణాల్లో తెలిసిపోతాయన్నారు.

**దేశానికే రోల్ మోడల్?గా హైదరాబాద్..**

ఈ సర్వేలో జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు,భవనాలు, చెరువులు,పార్కులు ఎన్ని ఉన్నాయో గుర్తిస్తామని, వాటి ప్రతి సంఖ్య కచ్చితంగా చెప్పే అవకాశం ఉంటుందన్నారు. ఉత్తరప్రదేశ్,మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు చిన్న చిన్న పట్టణాల్లో ఇలాంటి సర్వేలు జరిగాయని,మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు.దేశంలో హైదరాబాద్ నగరాన్ని మోడల్?గా తీర్చిదిద్దేందుకు ప్రయోగాత్మకంగా ఈ జీఐఎస్ సర్వే చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

**ఆరు నెలల్లో సర్వేపూర్తి :**

ప్రజల నుంచి సేకరించే డేటా రేల్ టేల్ సర్వర్?లో అత్యంత భద్రంతా ఉంటుందన్నారు.మొదట్లో ఒక్కో ఇంటి వద్ద సర్వే కోసం 40 నుంచి 45 నిమిషాల సమయం పడుతుందని, అందుకోసం సేకరించే వివరాలను తగ్గించామని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే.రవికుమార్ తెలిపారు.

**పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే..**

ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దర ఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ సర్వే ప్రక్రియ ఈనెల 31 నాటికి పూర్తి చేయడం జరుగుతుందని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే.రవికుమార్ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించాలని,సర్వే జరిగే సమయం లో ప్రజలు అందు బాటులో ఉండే విధంగా షెడ్యూల్ గురించి ముందుగానే సమాచారం అందిస్తామని అన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేసేందుకు అవసర మైన చర్యలు చేపట్టాలని చేపడుతున్నట్టు సూచించారు.

# మెదక్ జిల్లాలో గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్లు





**గ్రూప్-2 పరీక్షలకు పటిష్ట బందోబస్తు..**
**జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి**

**మెదక్,డిసెంబర్ 13(సూర్యరేఖ)** మెదక్ జిల్లాలో గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు.శుక్రవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డిమాట్లాడుతూ... జిల్లా పరిధిలో డిసెంబర్ 15 నుండి 16 వరకు జరిగే టిజిపిఎస్ సి గ్రూప్-పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ - 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 15 నుండి 16 వరకు 16 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే గ్రూప్- పరీక్షల సందర్భంగా డిసెంబర్ 15 ఉదయం 6:00 గంటల నుంచి డిసెంబర్ 16 సాయంత్రం 07:00 వరకు అంక్షలు అమలులో ఉంటాయని,పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని,ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు.పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్,జిరాక్స్ షాపులు,స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా జిల్లా పోలీస్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా, పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపినారు. మొత్తం జిల్లాలో 200 మంది పోలీస్ అధికారులతో భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇట్టి బందో బస్తులో పాల్గొంటారని ఎస్పీ తెలిపారు.ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు,రాజకీయ పార్టీలు,వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు.అదేవిధంగా పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ నియమించినట్లు వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.అలాగే పరీక్షా కేంద్రాలకు దగ్గరలో ఉండే జిరాక్స్ షాపులు,ఇతరత్రా వాటిని ముందుగానే మూసి ఉంచేలా దుకాణదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులు, కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తప్ప ఇతరులను అనుమతించకూడదని వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో ఉండాలని సూచించారు. మొదటి సెషన్ ఉదయం 10:00 నుండి 12:30 వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 03:00 నుండి 05:30 వరకు జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉ 08:30 నుండి 09:30 గంటలకు వరకు అనుమతిస్తామని మధ్యాహ్నం సెషన్ లో 01:30 నుండి 02:30 వరకు మాత్రమే అనుమతిస్తామని తెలియచేశారు.రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గుర్తింపు కొరకు బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్రలు తీసుకోవడం జరుగుతుందని, ఇందుకు వీలుగా అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని,పరీక్షకు సంబంధించిన నిబంధనలు పూర్తిగా హాల్ టికెట్లో పొందపరచి ఉంటాయని, అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు హాల్ టికెట్ లోని నిబంధనలు చదువుకోవడం మర్చిపోవద్దని తెలిపారు.అభ్యర్థులను చెప్పులతో మాత్రమే పరీక్ష హాలుకు రావాలని,షూస్ కు అనుమతి లేదని స్పష్టం చేశారు.అదేవిధంగా మొబైల్ ఫోన్, క్యాలిక్యులేటర్, వాచ్,బెల్ట్ తదితర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెస్ కు అనుమతి లేదని,పరీక్షా కేంద్రం గేటు బయటే అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపాలన్నారు. అభ్యర్థులు తమ వెంట డౌన్ లోడ్ చేసుకున్న హాల్ టికెట్ సరైన ఫోటో గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు కావాలన్నారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు నియమించిన రూట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్ లు,లయజన్ అధికారులు సమన్వయం చేసుకొని పరీక్షలు సజావుగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రం చుట్టూ 360 డిగ్రీలలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.పరీక్షా కేంద్రాల్లోనికి అభ్యర్థులు చీఫ్ సూపర్డెంట్ లకు, అబ్జర్వర్లకు,బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు, ఇన్విజిలేటర్లకు మాత్రమే అనుమతి ఉందని తెలియజేశారు.

## రైతులకు మెరుగైన పరిహారం అందించేందుకు కృషి..

**సింగరేణి భూసేకరణ పరిహారంపై సంబంధిత రైతులతో చర్చించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి,డిసెంబర్13(సూర్యరేఖ)** భూసేకరణ కింద భూములు అందించే రైతులకు నిబంధనల ప్రకారం సింగరేణి సంస్థ ద్వారా మెరుగైన పరిహారం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.శుక్రవారం కోర్టు ఆదేశాల ప్రకారం రైతులు,సింగరేణి సంస్థ ప్రతినిధులతో సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సింగరేణి భూసేకరణ పరిహారంపై సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ...రామగిరి మండలం సుందిల్ల,ముస్త్యాల గ్రామాలలో సింగరేణికి సంబంధించిన భూసేకరణ అంశంపై రైతులకు మెరుగైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.నిబంధన ప్రకారం ఎంత వీలైతే అంత సింగరేణి సంస్థ నుంచి రైతులకు అధికంగా పరిహారం అందించేందుకు కృషి చేస్తామని,భూసేకరణ ప్రక్రియకు రైతులు కూడా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు,సింగరేణి జిఎం 1 లలిత్ కుమార్,రామగిరి తహసిల్దార్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పట్టా పొందిన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్




**ముత్తారం/పెద్దపల్లి(సూర్యరేఖ)** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న సంతోష్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల భాష బోధన పై ప్రొఫెసర్ కోదండ నాగేశ్వరరావు పర్యవేక్షణలో నుండి డాక్టరేట్ పట్టా పొందారు.ఈ సందర్భంగా మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయుల బృందం శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రేమావతిపేట యూనివర్సిటీకి రోడ్డు మార్గాన్ని మూసివేయడం దారుణం..

**ఎమ్మెల్యేను కలిసి వివరించిన కాలనీవాసులు..**
**సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్**







**రాజేంద్రనగర్,డిసెంబర్13** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమావతి పేట్ నుంచి యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు మార్గాన్ని మూసివేయడం దారుణమని జై భీమ్ జై రామ్ సంఘం అధ్యక్షుడు గోల్కొండ రాజు కుమార్,ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యంలు అన్నారు.ఎన్ని సార్లు యూనివర్సిటీ అధికారులను ఈ రోడ్డు విషయం గురించి అడిగినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డును మూయడానికే సుముఖంగా ఉన్నారని అన్నారు.రోడ్డుకు మూసివేసి గోడ కట్టడంతో శుక్రవారం వారు కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించారు.యూనివర్సిటీ అధికారులు ప్రజలు వినియోగించే రోడ్డును అక్రమంగా అడ్డు గోడ నిర్మించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు.ఈ విషయంపై ఎమ్మెల్యే దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.ఎన్నో ఏళ్ల నుంచి తమకు రాకపోకల కోసం ఉన్న ఈ రోడ్డును నూతన వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య మూసివేయించారన్నారు.ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి వీసీ జానయ్యతో చర్చిస్తానన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో డివిజన్ అధ్యక్షుడు నత్తి ధనుంజయ్, ఉపాధ్యక్షుడు మజ్జిగ నర్సింహా యాదవ్,టి.రవి ముదిరాజ్,మహిళా ఉపాధ్యక్షురాలు గోల్కొండ సునంద,బీఆర్ఎస్ నాయకురాలు ఎడ్లకాడి సరస్వతి,మీసాల పెంటమ్మ, నడికూడ ఇందిర,కోరని శోభ,బండారి శివరాణి,సులోచన,ఆగపల్లి హేమలత, ఎరుకలి గాయత్రి, ఎరుకలి లావణ్య,ఎడ్లకాడి లలిత,మంకాల మహేశ్వరి, గోల్కొండ మంజుల, గోల్కొండ సుమిత్ర,కోరని లావణ్య,కవ్వగూడెం అనసూజ,అమృత,కాసారం లక్ష్మమ్మ, మంగళారం దేవమ్మ,సి.సక్కుబాయ్,దానం అండాలు, డి.వసంత, ఎమ్. బాలమణి, ఎమ్.లత,ఆగపల్లి బాలమణి,లేవిరాజ్,ఉపేందర్,చంద్రశేఖర్, సుమన్, జనార్దన్, జగన్, నర్సింహా, ఉదయ్, ఖాసీం, నాని, సన్నీ, నవీన్, ప్రవీణ్, సత్తయ్య, వెంకీ, తదితరులు ఉన్నారు.

# పన్నుల వసూళ్లలో..నిర్లక్ష్యం వద్దు





**ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి..**
**ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి..**
**రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్**

**రాజేంద్రనగర్,డిసెంబర్ 13** ఆస్థిపన్ను వసూళ్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో సిబ్బంది వేగవంతం చేయాలని గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ అధికారులను ఆదేశించారు.ఆస్తి పన్ను వసూలుపై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆస్తి పన్ను వసూలుపై బిల్ కలెక్టర్ (బీసీ)లకు ఆస్తి పన్ను వసూళ్లలో తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధానంపై వసూళ్లపై మార్గనిర్దేశం చేశారు.ప్రాపర్టీ టాక్స్ వసూలు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ మాట్లాడుతూ...రాజేంద్రనగర్ సర్కిల్ కి రావాల్సిన పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.ఆస్తి పన్ను చెల్లింపు విషయంలో మొండి బకాయి దారులపై ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా కఠినంగా వ్యవహరించాలని ఆదే శించారు.2024-25 సంవత్సరానికి చెందిన ఆస్తి, వంటి తదితర పన్నులను 100 శాతం పూర్తి చేయాలన్నారు.పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం వహించిన అధికారి,సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.ప్రతి ఒక్కరు తమ పరిధిలోని వ్యాపార,వాణిజ్య సంస్థలకు విధిగా వెళ్లి పన్ను వసూళ్లను చేపట్టాలన్నారు.రోజువారీగా లక్ష్యాలను నిర్ధారించుకుని లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలని పేర్కొన్నారు.గతంలోనూ పన్ను వసూళ్లపై సమీక్ష సందర్భంగా పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించామని,ఇంకా కొందరు వెనకబడుతున్నారని, తీరుమారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఎంసీ జయప్రకాష్,బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలకు హాజరు కావాలి




**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి..**
**పరీక్ష కేంద్రాలకు సెల్ ఫోన్,ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతి లేదు..**
**గ్రూప్ 2 పరీక్షల నేపథ్యంలో అభ్యర్థులకు పలు సూచనలు జారీచేసిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి,డిసెంబర్13(సూర్యరేఖ)** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ అభ్యర్థులు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.డిసెంబర్ 15,16 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు,మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు రెండు సెషన్లలో 4 పరీక్షలు జరుగుతాయని, పెద్దపల్లి జిల్లాలో మొత్తం 9 వేల 18 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారని వీరి కోసం 18 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి,మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని,పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు,మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తామని,దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదని,అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ కోరారు.అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు,ఫోటోతో కూడిన హాల్ టికెట్,ప్రభుత్వం జారి చేసిన ఒరిజినల్ ఫోటో ఐడి కార్డ్ తీసుకుని రావాలని,హాల్ టికెట్ పై పాస్పోర్ట్ సైజ్ ఫోటో ముద్రించి తీసుకుని రావాలని,ఒకే హాల్ టికెట్ ను పరీక్ష మొత్తం వినియోగించాలని తెలిపారు.హాల్ టికెట్ లో ఫోటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్షా హాల్లో ఇన్విజిలేటర్ కు అప్పగించాలని అన్నారు.అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్ సెల్ఫోన్ పెన్ డ్రైవ్,బ్లూ టూత్ డివైసెస్,జువెలరీ,ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామాగ్రి తీసుకుని రావడానికి వీల్లేదని,చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని షూస్ వేసుకోవద్దని తెలిపారు. సెల్ఫోన్ బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అభ్యర్థులు తీసుకువచ్చినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటూ అభ్యర్థిని ఇన్వాల్వ్ చేయడం జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్ళరాదని,బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలీడ్ కాదని,బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ టాటూ వంటివి పెట్టుకోవద్దని అన్నారు.ప్రతి పేపర్ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్ టికెట్ పై సంతకం పెట్టాలని అన్నారు.మోడల్ ఓఎంఆర్ షీట్లను వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలని, ఓఎంఆర్ షీట్ ను సరిగా చెక్ చేసుకోవాలని,పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్ ను విడిచి వెళ్లడానికి వీలులేదని అన్నారు.అభ్యర్థి ఫోటోగ్రాఫ్ సంతకం యొక్క ముద్రించిన చిత్రాలు స్పష్టంగా ఉన్నప్పుడు హాల్ టిక్కెట్ చెల్లుబాటు అవుతుందని,కావున లేజర్ ప్రింటర్తో వీలైతే కలర్ ప్రింటర్తో ఏ4 సైజు కాగితంపై హాల్ టికెట్ని ముద్రించాలని,పరీక్ష తేదీ నుంచి మూడు నెలల్లోగా తీసిన అభ్యర్థి పాస్పోర్టు సైజు ఫోటోను పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు హాల్ టికెట్లోని నిర్దేశిత స్థలంలో గమ్తో అతికించాలని లేకుంటే అభ్యర్థి దరఖాస్తు తిరస్కరణకు గురవుతుందని అన్నారు.దివ్యంగ అభ్యర్థులు తప్పనిసరిగా సదరమ్ సర్టిఫికేట్ అనుబంధం-నిచీఫ్ సూపరింటెండెంట్కు చూపించాలని,స్క్రైబ్ లేదా పరిహార సమయాన్ని క్లెయిమ్ చేయడానికి పరీక్ష రోజున హాల్ టికెట్ పై స్క్రైబ్ అనుమతించబడిన అని ముద్రించిన అభ్యర్థులకు మాత్రమే స్క్రైబ్ సేవలు అందించబడుతాయని,అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్పై ముద్రించిన సూచనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ..





**భక్తజన సంద్రంతో,అయ్యప్ప శరణుఘోషతో మారుమోగిన కొల్చారం..**
**భారీ సంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప స్వాములు..**

**కొల్చారం,డిసెంబర్13(సూర్యరేఖ)** స్వామియే శరణమయ్యప్ప..హరి హర వాసనే శరణమయ్యప్ప అంటూ వంద లాది మంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో ప్రాంగణమంతా మార్మోగింది.మాజీ సర్పంచ్ ఆశన్నగారి శ్రీశైలం లక్ష్మి దంపతుల కుమారుడు రాహుల్ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అయన స్వగృహంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు.తుప్రాన్ అయ్యప్ప దేవాలయ, గురుస్వాములు వెంకట్ గౌడ్, ఆధ్వర్యంలో గణపతి,సుబ్రహ్మ ణ్యస్వామి పూజ, అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం, సహస్రనామ పూజ,మహా అలంకరణ,పడి వెలిగించారు. అల్లీపూర్, మంగళపర్తి,సన్ని దానం గురు స్వామి వెంకట్ గౌడ్, ప్రభాకర్,కుమార్, రవీందర్, శ్రీను,రమేష్,భాలాగౌడ్ల నేతృత్వంలో భూతనాత స్తుతి,తీర్థ ప్రసాద వితరణ అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.గురుస్వాములు, అయ్యప్ప స్వాములను ఆశన్నగారి శ్రీశైలం లక్ష్మి దంపతులు సత్కరించారు.చక్రపాణ అయ్యప్ప స్వామి భజన పాటలతో మారు మ్రోగింది. అభ్యంతం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా,దేవత మూర్తుల ఉత్సవ విగ్రహాలతో ప్రాంగణం మొత్తం శోభాయ మానంగా తీర్చిదిద్దారు.అల్లీపూర్ సన్నీదానం నుండి వచ్చిన అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజారులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉదయం10 గంటలకు ప్రారంభమైన పడిపూజ కార్యక్రమాలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా కొనసాగాయి. ప్రత్యేకమైన మండపం ఏర్పాటు చేసి సర్వాంగా సుందరంగా రంగు రంగుల పువ్వులతో అలంకరించారు. ముందుగా శ్రీ విఘ్నేశ్వర,శ్రీ సుబ్రమణ్య స్వామి,శ్రీ అయ్యప్ప చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీఅయ్యప్ప స్వామి విగ్రహానికి పాలాభిషేకం,నెయ్యాభిషేకం, నిర్వహించారు.పద్దెనిమిది మెట్లపై ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ అయ్యప్ప స్వాముల పెటతుల్లి భక్తులను ఆకట్టుకుంది.అనంతరం పద్దెనిమిది మెట్లపై దీపాలు వెలిగించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమానికి హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు కిష్టయ్య, శ్రీశైలం, అంజయ్య, సత్యనారాయణ,వేణు, నర్సిములు,రాజిరెడ్డి,పాంద్ర వెంకటేశం,శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, కోటయ్య, ప్రదీప్, కిరణ్, వెంకట్రాములు, సత్యనారాయణ,వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు, ప్రజా ప్రతి నిధులు,వివిధ పార్టీల నాయకులు,భారీ సంఖ్యలో అయ్యప్ప స్వాములు, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయే..

**కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలి..**
**ప్రజల సమస్యలపై వారికి అండగా ఉండాలి..**
**బీజేపీ నాయకుల సమావేశంలో అశోక్ రెడ్డి,బొక్క నర్సింహ్మారెడ్డిలు**





**రాజేంద్రనగర్,డిసెంబర్13** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ మాత్రమేనని బీజేపీ జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి అశోక్రెడ్డి,జిల్లా బీజేపీ అధ్యక్షులు బొక్క నర్సింహ్మారెడ్డిలు అన్నారు.ప్రజల తరపున ప్రభుత్వంపై పోరాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో బీజేపీ చొరవ చూపాలని వారు పార్టీ కేడర్కు పిలుపునిచ్చారు.రాజేంద్రనగర్ అసెంబ్లీ సమావేశాన్ని అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అధ్యక్షతన ఉప్పర్పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వారు హాజరై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ...భారతీయ జనతా పార్టీ సభ్యత్వంపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని వివరించారు.పార్టీ సభ్యత్వ నమోదులో అందరూ భాగస్వాములు కావాలన్నారు.ప్రతి వార్డులోనూ బీజేపీ వాదాన్ని ప్రజలకు వివరించడంతోపాటు కేంద్రంలో ప్రధాని మోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపైనే ఉందని వివరించారు.ఈ మేరకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్,ఎం.కొమురయ్య,బొక్క బాల్ రెడ్డి, జయానంద్ రెడ్డి,,ఎస్.విజయ్ కుమార్,అడికె జనార్ధన్,విక్రమ్ చారి,రావుల జగన్,బండారి బాలకృష్ణ,శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 15 న సత్సంగ్ విహార్ 14 వార్షికోత్సవాలు

**హాజరు కానున్న గవర్నర్**



**రాజేంద్రనగర్,డిసెంబర్13** సమాజంలో ప్రతి ఒక్కరూ ఎదో ఒక సమస్యతో సతమతమవుతూ..వాటి నుండి బయటపడే మార్గంలో ఎక్కడెక్కడికో పరుగులు పెడుతున్నారని.. జీవితంలో వచ్చే అన్ని సమస్యల గురించి శ్రీశ్రీ ఠాకూర్ అనుకూలచంద్రుల వారు సత్సంగ్ లో సులభమైన మార్గాన్ని ఇచ్చారని నిర్వాహాకులు తెలిపారు.అందులో భాగంగా నగరంలోని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డైరీఫాం చౌరస్తాలోని సత్సంగ్ విహార్లో 14 వ వార్షికోత్సవాలను ఈ నెల 15 డిసెంబర్ ఆదివారం రోజున అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ఉత్సవానికి ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పాల్గొననున్నారని తెలిపారు.కావున,సత్సంగ్ విహార్ అందరినీ సాదరంగా ఆహ్వానిస్తుందని,అందరూ బంధుమిత్రులతో సహా ఈ ఉత్సవంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించి,శ్రీశ్రీ ఠాకూర్ వారి ఆశీస్సులను పొందాలని సూచించారు.మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9440994439,9030503885 లలో సంప్రదించాలన్నారు.

## కురుమ ఆత్మగౌరవ భవన శంకుస్థాపనకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి..

**సభను విజయవంతం చేయాలని పిలుపు..**
**సీఎం సభ ఏర్పాట్లను పరిశీలనలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**





**రాజేంద్రనగర్,డిసెంబర్13** తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి హాస్టల్ ట్రస్ట్,దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మ గౌరవ భవన శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కోకాపేట్ లో నిర్మాణం పూర్తి చేసుకొని శంకుస్థాపన కానున్న నేపథ్యంలో సీఎం సభ ఏర్పాట్లను ఆయన ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశంతో కలిసి పరిశీలించారు.అంతేకాకుండా భద్రత ఏర్పాట్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..సీఎం రేవంత్రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీఠ వేస్తున్నారన్నారు.అందరికీ ఆత్మగౌరవ భవనాలను ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న విధానాలను వ్యక్తీకరిస్తున్నారన్నారు.సీఎం సభకు పెద్ద సంఖ్యలో పార్టీ కేడర్ తరలి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మోహన్ బాబును అరెస్టు చేయాలి..






**జర్నలిస్టులపై దాడి దారుణం..**
**మండిపడ్డ జర్నలిస్టుల సంఘాలు**
**సినీ నటుడు మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు,జర్నలిస్టుల ర్యాలీ**

**రాజేంద్రనగర్,డిసెంబర్ 13** జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడికి పాల్పడిన సినీ నటుడు మంచు మోహన్ బాబు పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ రాజేంద్రనగర్ ప్రింట్ మీడియా,ఎలక్ట్రాన్ మీడియా ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులు అత్తాహర్ లో నిరసన వ్యక్తం చేశారు. టీవీ9 రిపోర్టర్ ఎం.బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 143 నుంచి ఉప్పర్పల్లిలోని రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సినీ నటుడు మోహన్ బాబు డౌన్ డౌన్ అంటూ- మోహన్ బాబును అరెస్టు చేయాలని దారిపొడవునా నినాదాలు చేశారు. అనంతరం రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హైదరున్నీసా కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు అప్పరెడ్డిగూడెం భీమయ్య ఎం.బాలసుబ్రమణ్యం,

**పి.సూర్యనారాయణ,వెంకటయ్య, క్రిష్ణగౌడ్, సుదర్శన్డ్, కె.నర్సింహ్మా తదితరులు మాట్లాడుతూ.**

జర్నలిస్టులపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్ బాబును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించేలా ఒక జీవోను తీసుకురావాలన్నారు. జర్నలిస్టుపై వ్యక్తిగతంగా దాడి చేసి దూషించడం అన్నది దారుణంఅన్నారు.ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.ఆయన ఒక నటుడు గానే కాకుండా ప్రజాస్వామ్యవాదిగా గతంలో ప్రజాప్రతినిగా చేసిన అనుభవం ఉన్నప్పటికీ కావాలని ఆయన ఆవేశానికి లోనయ్యాడా వ్యక్తిగతంగా దాడి చేయడం అన్నది చాలా దారుణం. జర్నలిస్టులందరూ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంచు మనోజ్ కోరిక మేరకే జర్నలిస్టులు,మీడియా ప్రతినిధులు సినీ నటులు మోహన్ బాబు ఇంటికి వెళ్లారని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు మేకల దామోదర్ రెడ్డి, ఎం.ప్రేం రాజ్,బుడిగె బాబురావు, వి.సూర్యకిరణ్, యు.శ్రీకాంత్,గద్దె యాదగిరి, కోరని మహేశ్, అంజిలప, తిరుమలేశ్, అనిల్, ప్రశాంతిడి, గౌస్,మోసిన్,కోట సాయికుమార్, పి.రామక్రిష్ణ రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టి కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించడం పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయం





**రాఘవపూర్ లో వర్క్ సైట్ స్కూల్ ప్రారంభోత్సవంలో రామగుండం సీపీ శ్రీనివాస్**

**పెద్దపల్లి,డిసెంబర్13(సూర్యరేఖ):** జిల్లాలో ఇటుక బట్టి కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించడం పోలీసు ప్రధాన ధ్యేయమని వర్క్ సైట్ స్కూల్ పేరుతో బసంత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవపూర్ లో పాఠశాల ప్రారంభోత్సవంలో రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్బంగా సీపీ మాట్లాడుతూ..బాలకార్మిక వ్యవస్థ,వెట్టి చాకిరి నిర్మూలన,కార్మికుల పిల్లలకు తప్పనిసరిగా విద్యను అందించాలని పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయంగా పనిచేస్తుందని సీపీ అన్నారు.ఇటుక బట్టీలలో పలక బలపం పట్టవల్సిన చిట్టి చేతులు ఇటుక బట్టీలలో తల్లితండ్రులతో కలిసి ఇటుకలను చేస్తూ,మోస్తున్న కార్మికుల పిల్లల పరిస్థితి తెలిసి బాధిస్తుందని,తాను ఇటుక బట్టి యజమానులతో మాట్లాడి కార్మికుల బాగోవులు చూడడంతో పాటు వారి పిల్లలను కార్మికులుగా మార్చవద్దని ఖచ్చితంగా వారికి విద్యాభ్యాసం కల్పించాల్సిందేనని ముఖ్య ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన వర్క్ సైట్ స్కూల్ కార్మికులు వారి పిల్లలకు క్లాస్ రూములను సద్వినియోగం అయ్యేలా చూడలన్నారు. వలస కార్మికులు బతుకు దెరువు కోసం స్వరాష్ట్రం వదిలి వేలాది కిలోమీటర్ల దూరం వచ్చి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారని, వారి పిల్లలు సైతం వారి చెంతనే ఉంటూ భవిష్యత్తు కార్మికులుగా మారుతున్నారని, కార్మికులతో పాటు వారి పిల్లలు విద్యాభ్యాసం మాని బట్టిల్లో పని చేయడం సరికాదన్నారు. వారికి బంగారు భవిష్యత్తు ఉండాలని యజమానులతో మాట్లాడి కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో పాఠశాలలు ప్రారంభించామన్నారు.పిల్లల భవిష్యత్తుకు చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని సదుద్దేశంతో ప్రైవేటు పాఠశాలల మాదిరిగా ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఇక్కడ 70 మంది పిల్లలు ఉన్నారని,వాళ్లకి ఫస్ట్ క్లాస్ నుండి ఫిఫ్త్ క్లాస్ వరకు ఒరిస్సా భాషలో నేర్పించడానికి ఒరిస్సా నుంచి టీచర్లు కూడా ఏర్పాటు చేశామని,కమీషనరేట్ పరిదిలోని ఇటుక బట్టిలలో త్వరలో వర్క్ సైట్ స్కూల్ ఏర్పాటు చేసేలా చూస్తామని తెలిపారు. విద్యార్థులకు స్వయంగా పుస్తకాలు ఇతర సామాగ్రి పంపిణీ చేశారు. పిల్లలందరూ మంచిగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేయాలని సీపీ కోరారు. పెద్దయ్యాక ఏమవుతారని పిల్లలను సిపి శ్రీనివాసులు అడగగా పిల్లలు పోలీస్ అని జవాబిచ్చారు.వాళ్ళ ఆకాంక్షలు నెరవేరాలని పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, పెద్దపెల్లి ఏసీపీ జి కృష్ణ,గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి,పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్,బసంత్ నగర్ ఎస్సై స్వామి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ హజర శంషర్ తబ్రైజ్ ఉరుసు ఉత్సవాలు

**ఆందోల్,డిసెంబర్13(సూర్య రేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడు మండలం హస్నాబాద్ గ్రామంలోని గల హజరత్ శంషర్ తబ్రెజ్ హర్సు ఉత్సవాలు జనవరి 02 నుండి 6 వ తేదీ వరకు నిర్వహించడంజరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.మొదటి రోజు సర్కారి గంధం,4 వ తేదీన ఊరగంధలు హస్నాబాద్, ఔరంగానగర్,ఎంకేపల్లి, కోడూరు గ్రామాల చిన్న పెద్దల గంధం ఉందన్నారు.6 వ తేదీన మహారాష్ట్ర కర్ణాటక, అష్టూర్, పెద్దపెద్ద మల్ల యోధులు తెలంగాణ రాష్ట్రంలోని మల్లయోధులు హాజరు కావటం జరుగుతుందన్నారు.కుస్తీ పోటీలో గెలుపొందిన వారికీ మొదటి బహుమతి 4.5 తులాల వెండి కడెం,నగదు బహుమతి రూ.12 వేలు,రెండవ బహుమతి 5 తులాల వెండి కడెం బహుకరించబడునన్నారు. ఈ కుస్తీ పోటీలలో హస్నాబాద్ గ్రామ ప్రజలకు,చుట్టుపక్కల గ్రామాల 10 కిలోమీటర్ల దూరం వరకు వున్నవారు పాల్గొనడానికి అవకాశం లేదని తాజా మాజీ సర్పంచ్ పుర హనుమంత్ ముదిరాజ్, తాజామాజీఎంపీపీ మమత అశోక్,తాజా మాజీ ఉపసర్పంచ్ జైపాల్ ముదిరాజ్, జిల్లా నాయకులు యాదవ్ ముదిరాజ్ లు తెలిపారు.

# మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల నిరసన



**రామాయంపేట,డిసెంబర్13(సూర్య రేఖ)** మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పనులు మాని నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ..మున్సిపల్ కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తారన్నారు.ఐదు సంవత్సరాల నుంచి ఈ సంవత్సరం వరకు రెండు జతల బట్టలే ఇచ్చారని,ప్రతి నెల నూనె సబ్బులు, చెప్పులు, మాస్కులు, బ్లౌజులు ఇవ్వాలని, ఇవ్వడం లేదన్నారు.ప్రతినెల జీతాలు కూడా ఇవ్వడం లేదని, అయినా వాళ్ళు పొద్దున లేచి సాయంత్రం వరకు పని చేస్తారన్నారు.సెలవు లేకుండా పని చేయాలంటే ఎలా ప్రశ్నించారు.వారికి పీఎఫ్,ఈఎస్ ఐ సౌకర్యాన్ని కల్పించడంలోనూ విఫలమవుతున్నారని మండిపడ్డారు.ఈ పరిస్థితిలో మున్సిపల్ కార్మికులు ఎలా పని చేస్తారని ప్రశ్నించారు.శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



**మంథని/పెద్దపల్లి,డిసెంబర్13(సూర్యరేఖ):** గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని పెద్దపల్లి జిల్లా మంథని మండలం గోపాల్ పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రు రాజమల్లు అన్నారు.పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గోపాల్ పూర్ గ్రామంలో పాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు సెంటర్ వద్ద గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రు రాజమల్లు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్ కు రూ.500 ల బోనస్ ఇచ్చినందున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..రైతుబంధు అని చెప్పి అసలు రైతుల కన్నా గుట్టలకు,ప్లాట్లకు రోడ్లకు రైతుబంధు డబ్బులు వృధాగా ఖర్చు చేశారని,ఖజానా మొత్తం ఖాళీ చేశారని విమర్శించారు.రైతులకు ఎన్నికల ముందు హామీలలో భాగంగా రైతు భరోసా పేరిట రైతులకు సన్న వడ్లకు పండించిన సన్నకారు,చిన్నకారు రైతులందరికీ మేలు జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ అమలు చేయడం జరిగిందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.మాట ఇస్తే నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రైతులు,గ్రామ నాయకులు, మహిళలు హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**రామగిరి/పెద్దపల్లి,డిసెంబర్13(సూర్యరేఖ):** రామగిరి మండలం రామయ్య పల్లె గ్రామంలోని ఐఎన్టీయూసీ నాయకుడు శంకేసి రాయమల్లు తల్లి గురువమ్మ ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ నివాళులర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న,తాజా మాజీ ఎంపిటిసి తీగల సమ్మన్న,తాజా మాజీ సర్పంచ్ దేవునూరి రజిత శ్రీనివాస్,ఉప సర్పంచ్ నరేష్ యాదవ్,వార్డు సభ్యులు దేవునూరి తరుణ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవునూరి రాజేష్,నాయకులు దాడి మల్లయ్య,కన్నూరి సతీష్,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ





**నాగిరెడ్డిపేట,డిసెంబర్13(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం బంజారా గ్రామపంచాయతి పరిధిలోని సాతేల్లి బాల్ రాజ్ గౌడ్ స్వామి స్వగృహంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహా పడి పూజ ఘనంగా జరిగింది.మాల ధరించిన స్వాములు అందరు సామూహికంగా సిద్దు శాస్త్రి మంత్రోచ్చారణలతో పూజలు ఘనంగా నిర్వహించారు.అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతంతో అభిషేకం చేసి అయ్యప్ప స్వామి భక్తి పాటలతో స్వాములు పరవశింపజేశారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**సిద్దిపేట :** టీజీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. టిజీపీఎస్సీ నిబంధనల మేరకు ఈనెల 15 మరియు 16 తేదీలలో జిల్లాలో టిజిపిఎస్సి గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 13714 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షకు హాజరుకానున్నారని ఇందుకు సిద్దిపేట పట్టణంలో మొత్తం 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్ష నిర్వహణకు 39 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 37 మంది చీఫ్ సూపరింటింటెంట్లు, 04 గురు రూట్ అధికారులు, 12 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లును, 576 మంది ఇన్విజిలెటర్లు,101 మంది బయో మెట్రిక్ ఇన్విజిలెటర్లను నియమించామన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం అన్ని పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యాలు కల్పించామని, అభ్యర్థులు సమయానికి పరిక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టిసి బస్ లను నడిపేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, పరిక్షా కేంద్రాలకు 3 కిలోమీటర్ల లోపు 144 సెక్షన్



విధించడం జరుగుతుందని, జిరాక్స్ కేంద్రాలను మూసివేయడం జరుగుతుందని అన్నారు.
15 వ తేదీ ఆదివారం నాడు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 1 పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8:30 గంటలనుండి 9:30 గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని అన్నారు.
అలాగే 2వ పేపర్ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందని అభ్యర్థులను మధ్యాహ్నం 1:30 గంటల నుండి 2:30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని అన్నారు.
16వ తేదీ సోమవారం 3వ పేపర్ ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులను ఉదయం 8:30 గంటల నుండి 9:30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని అన్నారు.
అలాగే 4 వ పేపర్ 16 వ తేది నాడు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందని అభ్యర్థులను మధ్యాహ్నం 1:30 గంటల నుండి 2:30 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సెల్ ఫోన్లు, వాచీలు తదితర ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం కుదరదు కాబట్టి అభ్యర్థులు ఎవరు ఎలక్ట్రానిక్ వస్తువులను వెంట తీసుకురావద్దని సూచించారు.

# పట్టణంలోని అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**పెద్దపల్లి :** పట్టణంలోని అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణ రావు పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే టీఎఫ్ ఐడీసి నిదుల ద్వారా ప్రారంభం కానున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తో కలిసి మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధి కొరకు నెల రోజుల క్రితం 30 కోట్ల రూపాయలతో పనులకు శంకుస్థాపన చేసుకుని పనులు మొదలు పెట్టడం జరిగిందని 9 ప్యాకేజీలకు గాను 7 ప్యాకేజీల పనులు మొదలు పెట్టడం జరిగిందని ఈనెల 4వ తేదీన పెద్దపల్లి పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి ఏనుమల రేవంత్ రెడ్డి పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి 15 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 4 ఎకరాల స్థలంలో నాలుగు కోట్ల రూపాయలతో పార్కు ఏర్పాటు చేసుకోవడం మిగతా 11 కోట్ల రూపాయలతో పెద్దపల్లి పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరం ఉన్నచోట సిసి రోడ్లు, మురికి కాలువలు, ఇతరత్రా పనులను చేసుకోవడం జరుగుతుందన్నారు. పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి రానున్న ఆరు నెలల్లో మరో 45 కోట్ల రూపాయల తో పనులు చేయుటకు అనుమతులు తీసుకోవడం జరిగిందని, పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం నుండి జెండా చౌరస్తా వరకు,జెండా చౌరస్తా జెండా నుండి మజీద్ వరకు అలాగే జెండా నుండి సుభాష్ విగ్రహం వరకు 75 లక్షల రూపాయలతో 40 ఫీట్లతో బిటి రోడ్డు పనులను త్వరలోనే



మొదలు పెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు మున్సిపల్ ఏఈ, కౌన్సిలర్లతో కలిసి రోడ్డు వెడల్పు స్థలాలను పరిశీలించి, పట్టణ ప్రజలకు వారికి అనుకూలంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, మురికి కాలువలు నిర్మాణం చేయిస్తామని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ , కౌన్సిలర్లు నూగిల్ల మల్లన్న, భూతగడ్డ సంపత్,పాగల సోని శ్రీకాంత్, మున్సిపల్ ఏఈ సతీష్ టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# నిర్వాసితులు ఇంటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**నగరంలోనే అత్యంత విలువైన ప్రాంతంగా రఘునాథపాలెం మండలం అభివృద్ధి**

**రైల్వే మూడవ లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి రఘునాథ పాలెం మండలం వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం :** రైల్వే మూడవ లైన్ క్రింద ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు, వారికి కేటాయించిన ఇండ్ల స్థలాలలో ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, వారికి అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు కల్పించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రైల్వే మూడవ లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైల్వే 3వ లైన్ క్రింద



పూర్తిగా ఇండ్లను కోల్పోయిన 58 మందికి వెంకటాయపాలెంలో 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, వీరికి పట్టాలతో పాటు ఇంటి విలువ పరిహారం కూడా అందించామని అన్నారు. నిర్వాసితులు ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాలతో ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, వీరికి అవసరమైన త్రాగు నీటి సరఫరా, డ్రైనేజ్, విద్యుత్తు మొదలగు మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అమరావతి వెళ్ళే జాతీయ రోడ్డు, సర్వీస్ రోడ్డు ఈ ప్రాంతంలో వస్తాయని, ఇక్కడ భూములకు మంచి ధరలు పెరుగుతాయని అన్నారు.
యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు సమీపంలోనే నిర్మాణం అవుతున్నాయని, మీ పిల్లలు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించిన పరిహారం సద్వినియోగం చేసుకుంటూ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఇక్కడ సమీపంలోనే కలెక్టరేట్ ఉన్నదని, వైద్య కళాశాల, ఆసుపత్రి వస్తాయని, ఈ ప్రాంతం చాలా విలువ కలిగిన ప్రాంతం అవుతుందని అన్నారు.
ఖమ్మం నగరంలోని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చే బాధ్యత, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాల్లో ఇళ్లను కోల్పోయే వారికి సైతం నగరం చుట్టూ మంచి స్థలాల్లో చూసి ఇంటి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, మునిసిపల్ కార్పొరేటర్లు తోట రాములు, కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మోసం చేసిన మంత్రిపై చీటింగ్ కేసు పెట్టాలి

**ముత్తారం వేదికగా ఇచ్చిన బెల్ట్‌షాప్‌ల మాట ఏమైంది**

**ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని :** మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై 420చీటింగ్ కేసు నమోదు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామిలన్నీ నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చే ఏడాదైనా ఒక్క హామిని అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఆనాడు ఎన్నికల ప్రచారంలో బాగంగా ముత్తారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బెల్ట్‌షాప్‌లను తొలగించాలనే మహిళల అభ్యర్థన మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన వెంటనే తమ అధిష్టానానికి ఈ విషయం చెప్పి బెల్ట్‌షాప్‌లు లేకుండా చేస్తామని ముత్తారం వేదికగా మహిళలకు ఇచ్చిన వాగ్దానం ఎటు పోయిందని ఆయన ప్రశ్నించారు. గత 40ఏండ్లుగా ఒకే కుటుంబానికి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే ఏం అభివృద్ధి పనులు చేశారో, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. తాము ప్రభుత్వ పనితీరును




వైఫల్యాలను ప్రశ్నిస్తే కింది స్థాయి నాయకులతో దూషించేలా మాట్లాడించడం, తన సామాజిక వర్గ నాయకులతోనే తనపై దాడులు చేయించడం సరికాదని, మంథని అభివృద్ధిపై ఆలోచన చేయాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో చిన్నకాళేశ్వరం పూర్తి చేస్తామని మాట్లాడిన మంత్రి ఆనాడు ఎమ్మెల్యేగా ఇరిగేషన్ అధికారులతో సాధారణంగానే రివ్యూచేశానని, ఆ ప్రాజెక్టు పేరుతోనే తాము అధికారంలోకి వస్తామని మాట్లాడలేదా అని ఆయన ప్రశ్నించారు. ఓడేడు వంతెనపై ఆనాడు ప్రభుత్వంపై నిందెలు మోపిన మంత్రి ఈనాడు తమ ప్రభుత్వం అధికారంలోనే ఉంది కదా ఇప్పుడు ఒడేడ్ బ్రిడ్జి ఎందుకుపూర్తి చేయించడం లేదన్నారు. అలాగే కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు రహదారి నిర్మాణం కోసం కేవలం రూ. 4కోట్ల నిధులు మంజూరీచేయలేకపోతున్నారని, ఈ రహదారి నిర్మాణంతో భూపాలపల్లి వెళ్లేందుకు దూరభారం తగ్గుతుందని ఆయన వివరించారు. ఏడాది కాలంలో అనేకం చేస్తామని మభ్యపెట్టి ఒక్క అభివృద్ధి పనిచేయాలని అసమర్ధుడు మంథని ఎమ్మెల్యే అని ఆయన విమర్శించారు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై 420కేసు నమోదు చేయాలని పోలీసులకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేయడం జరుగుతుందని పోలీసులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని ఆయన ఈ సందర్బంగా స్పష్టం చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు యెగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, ఆరేపల్లి కుమార్, మాచిడి రాజు గౌడ్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు

## జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలకు కళాశాల విద్యార్థుల ఎంపిక




**రామాయంపేట,డిసెంబర్13(సూర్య రేఖ)**రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి తెలిపారు.మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో కళాశాలకు చెందిన బద్రు ఖోఖో విభాగంలో,స్పందన కబడ్డీ రన్నింగ్,సప మెహిరోన్ కబడ్డీ, విభాగంలో,చరణ్ ఖోఖో,రన్నింగ్ విభాగంలో,సాయి చరణ్ కబడ్డీ,ఖోఖో విభాగంలో పాల్గొని మండల స్థాయిలో ప్రతిభ కనపరిచినట్లు ఆమె వివరించారు.జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు వారు ఎంపికైనట్లు చెప్పారు.ఈ సందర్భంగా కళాశాలలో వారిని అభినందించారు.జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో ప్రతిభా కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఈ సందర్భంగా ఆమె వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు మల్లేశం,కళాశాల అధ్యాపకులు సురేందర్ రెడ్డి,ఆంజనేయులు, మస్తాన్,అశోక్ గౌడ్,బాల ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన




**రామయంపేట,డిసెంబర్13(సూర్యరేఖ)** మోడల్ స్కూల్ వ్యవస్థలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు అన్నారు.మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోమటిపల్లి మోడల్ స్కూల్ వ్యవస్థలో ఉన్నటువంటి వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మోడల్ స్కూల్ ముందు ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ..పాఠశాలలో అన్ని రకాల వసతులు విద్యార్థులకు కల్పించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఇందుకు పాఠశాలలో మౌలిక సదుపాయాల విషయంలో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం వెంటనే కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి,వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్ రెడ్డి,మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో అక్రమ నిర్మాణాలు

**నిద్రావస్థలో మున్సిపల్ అధికారులు**

**కామారెడ్డి,డిసెంబర్ 13( సురే రేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలో మునిసిపల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టు వేసే నాధుడే కరువయ్యాడు.మున్సిపల్ పరిధిలోని 35 వ వార్డు,12 వ వార్డు,9వ వార్డులో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు.మున్సిపల్ అధికారులు మాత్రం అటువైపు చూడడం లేదు.డ్యూటీకి వెళ్తున్నామా.. వస్తున్నామా.. అన్న చందనంగా మారింది.మున్సిపల్ అధికారుల పనితీరు సామాన్యుడు ఇంటి నెంబర్ కోసం పోతే రూ.10 వేల నుంచి రూ.15 వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.కామారెడ్డి పట్టణంలో పలు వార్డులలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.పట్టణంలోని పలు వార్డులలో ఒకటి కాదు,రెండు కాదు ఏకంగా పదుల సంఖ్యలో పుట్టగొడుగుల అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.జి ప్లస్ టు కి అనుమతులు తీసుకొని ఎలాంటి నిబంధనలు పాటించకుండా రోడ్డును సైతం ఆక్రమించుకొని జి ప్లస్ 3,4,5 నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు.ఇదే క్రమంలో పట్టణ శివారు లింగాపూర్ దేవునిపల్లిలలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.ఇదంతా జరుగుతున్నా అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు తమకేమీ పట్టిందిలే అన్న చందనంగా వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.పట్టణ శివారు వార్డులలో వేగంగా అభివృద్ధి జరుగుతున్న క్రమంలో అక్రమ నిర్మాణాల జోరుగా సాగుతున్నాయి.అధికారుల పర్యవేక్షణ మాత్రం ఎక్కడ కనిపించడం లేదని తెలుస్తుంది.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 12వ వార్డులో నూతన భవన నిర్మాణం చేపడుతున్నారు.సెట్ బ్యాక్ బ్యాక్ లేకుండానే ఇంటి యజమాని ప్రభుత్వ డ్రైనేజీపై ప్లింత భూమి పోసి కడుతున్నాడని స్థానికులు తెలుపుతున్నారు. ముడుపులో కోసమేనా ఈ మౌనం అని ప్రజలు అంటున్నారు.కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా జరుగుతున్నా అధికారులు,ప్రజా ప్రతినిధులు మౌనం వహించేది కేవలం ముడుపుల కోసమేనా అనే సందేహం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.ఇంత భారీ మొత్తంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సహకరిస్తున్నారంటే ఎంత పెద్ద మొత్తంలో ముడుపులు ముడుతున్నాయో అర్థం చేసుకోవచ్చని స్థానిక ప్రజలు అంటున్నారు.ముడుపుల కోసం పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాయకుండా అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సింగరేణి ఆవిర్భావ వేడుకల ఏర్పాట్ల సమావేశం.




**గోదావరిఖని :** గోదావరిఖనిలోని ఆర్జీ.1 జియం కార్యలయం సమావేశ హాలు నందు సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల గురించి శుక్రవారం నాడు గోదావరిఖనిలోని వివిధ పాటశాలల కరాస్పండెంట్స్ డ్యాన్స్ మాస్టర్స్, సేవా సభ్యులతో సాంస్కృతిక కార్యక్రమముల ఏర్పాట్ల గురించి సమావేశం నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమమునకు ముఖ్య అతితులుగా యస్.ఓటు జియం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు గార్లు పాల్గొని సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవముగా నిర్వహించలని తెలిపారు.

# రెజీనా కసాండ్రా బర్త్ డే స్పెషల్.. సన్నీడియోల్ టీం జాట్‌లుక్ వైరల్



బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీడియోల్ హీరోగా నటిస్తోన్న చిత్రం జాట్ టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నాడు. ఎస్‌డీజీఎం గా రాబోతున్న ఈ చిత్రానని మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఇవాళ పుట్టినరోజు జరుపుకుంటున్న రెజీనాకు శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. ఆకుపచ్చ ఫ్లోరల్ డిజైన్ చీరలో చిరునవ్వులు చిందిస్తున్న రెజీనాలుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే మాస్ ఫీస్ట్ లోడింగ్ అంటూ లాంచ్ చేసిన టీజర్ స్టన్నింగ్ యాక్షన్ పార్ట్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఈ చిత్రంలో బీటౌన్ స్టార్ యాక్టర్ రణ్‌దీప్ హుడా విలన్‌గా నటిస్తున్నాడు. ఈ చిత్రానికి టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ సినిమాకు రిషి పంజాబి సినిమాటోగ్రాఫర్ కాగా.. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్. ఈ సినిమాతో గోపీచంద్ మలినేని బీటౌన్ డెబ్యూ ఇస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.




## ట్విస్ట్‌తో అజయ్ దేవ్‌గన్ సింగం అగెయిన్ ఓటీటీ ఎంట్రీ

రోహిత్ శెట్టి పాపులర్ కాప్ యూనివర్స్ సింగం ఫ్రాంచైజీలో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన సినిమా సింగం అగెయిన్ బాలీవుడ్ యాక్టర్ అజయ్ దేవ్‌గన్ టైటిల్ రోల్‌లో నటించగా. అక్షయ్ కుమార్, రన్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, కరీనాకపూర్, దీపికాపదుకొనే కీలక పాత్రలు పోషించారు. నవంబర్ 1 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాగా.. మిక్స్ డ్ రెస్పాన్స్ రాబట్టుకుంది. కాగా థియేటర్లలో ప్రేక్షకుల అంచనాలను చేరుకోలేకపోయిన ఈ చిత్రం ఇక డిజిటల్ ప్లాట్‌ఫాంలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. ఈ యాక్షన్ ప్యాక్‌డ్ డ్రామా అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఈ చిత్రాన్ని మేకర్స్ ట్విస్ట్‌తో సినిమాను వీక్షించే అవకాశం కల్పించారు. ప్రస్తుతానికి ఈ చిత్రాన్ని రూ.499 ధరతో రెంటల్ ఫీ విధానంలో చూడొచ్చు. ఇక ఎవరైతే ఉచితంగా చూడాలనుకుంటున్నారో మరికొన్ని రోజులు ఆగాల్సిందేనన్నమాట. ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, జియో స్టూడియోస్, రోహిత్ శెట్టి పిక్చర్స్, దేవ్‌గన్ ఫిలిమ్స్ సంయుక్తంగా తెరెక్కించాయి. మరి ఓటీటీలో ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటుందనేది చూడాలి



## వెంకటేశ్ బర్త్ డే స్పెషల్.. ఇంప్రెసివ్‌గా సంక్రాంతికి వస్తున్నాం మీను సాంగ్ ప్రోమో

క్లాస్, మాస్, కామెడీ, ఫ్యామిలీ.. ఇలా అన్ని జోనర్లలో సినిమాలు చేస్తూ కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ తనదైన కామిక్ స్టైల్ ఆఫ్ యాక్షన్‌తో ఎంటర్‌టైన్ చేసే వెంకీమామ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఇండస్ట్రీ ప్రముఖులు, అభిమానులు, మూవీ లవర్స్, ఫాలోవర్లు వెంకీ మామకు బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు. తాజాగా అనిల్ రావిపూడి టీం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంక్రాంతికి వస్తున్నాం నుంచి మీను సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. మీనాక్షి చౌదరి గురించి ఈ పాట ఉండబోతున్నట్టు ప్రోమో చెబుతోంది. సాంగ్‌లో వెంకీ పోలీసాఫీసర్‌గా సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తూ ఘర్షణ సినిమాను మరోసారి గుర్తుకు తెస్తున్నాడు. ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. ఓ.. గోరింటాకెట్టుకున్న సందమామవే అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌కు నెట్టింట సూపర్ రెస్పాన్స్ వస్తోంది. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు.

ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.

# అల్లు అర్జున్‌కు హైకోర్టు మధ్యంతర బెయిల్..

## నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ రద్దు

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసులో అరెస్ట్ అయిన అల్లు అర్జున్‌కు హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అంతకుముందు నాంపల్లి కోర్టు అల్లు అర్జున్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దాంతో పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు అల్లు అర్జున్‌పై నమోదైన కేసును కొట్టివేయాలని, సాధ్యంకాని పక్షంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పోలీసులు పెట్టిన సెక్షన్‌లు అల్లు అర్జున్‌కు వర్తించవని ఈ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. నటుడు అయినంత మాత్రాన సామాన్య పౌరులకు వర్తించే మినహాయింపులను అల్లు అర్జున్‌కు నిరాకరించలేమని, ఆయనకు జీవించే హక్కు ఉన్నదని కోర్టు పేర్కొన్నది. అర్నాబ్ గోస్వామి కేసులో బాంబే కోర్టు తీర్పును ఆధారంగా తీసుకుని ఈ ఉత్తర్వులు ఇస్తున్నామని న్యాయమూర్తి తెలిపారు. మధ్యంతర బెయిల్ మంజూరైన నేపథ్యంలో ఇప్పటికే చంచల్‌గూడ జైలుకు తరలించిన అల్లు అర్జున్‌ను మరికాసేపట్లో విడుదల చేసే అవకాశం ఉంది.



Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,